ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి


5

శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 17 ఆగస్టు 2025



'సోమశిల'లో 46.670 టీఎంసీలు

అనంతసాగరం ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శనివారం 24,021 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో డ్యాంలో 46.670 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ డెల్టాకు 1,850, వరద కాలువకు 8,100, ఉత్తర కాలువకు 340 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.



'కిల్కారి' సేవల్లో 9వ స్థానం

- మొబైల్ యాప్ వల్ల ఎన్నో ఉపయోగాలు
- ఆశాలతో గర్భిణుల సమాచారం నమోదు
- ఇతర వైద్య సేవలపై వాయిస్ మెసేజ్
- అమలుపై అధికారుల నిర్లక్ష్యం
- తాజాగా ప్రభుత్వం వివరాల వెల్లడి

8 లో..

చలో కరేడుకు అనుమతి లేదు

- 30 పోలీసు యాక్టు అమలులో ఉంది
- బయటి వ్యక్తులను గ్రామంలోకి రానివ్వం
- కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

- వివరాలు 8లో

గౌతు లచ్చన్న జీవితం నేటితరానికి ఆచరణీయం

- వివరాలు 8లో

దంతాలు లేవా?
అన్ని రకాల ఆహార పదార్థాలు తినలేకపోతున్నారా?
ఇంప్లాంట్స్‌తో దృఢమైన పళ్ళు మీ సొంతం చేసుకోండి
డా. కవిత రెడ్డి గారు
ఉచిత దంత చికిత్సలు: EHS (ఎంప్లాయిస్ హెల్త్ కార్డు), CGHS & ఆరోగ్య భద్రత ద్వారా
EMI సౌకర్యం కలదు
Dr. Kiran's SMILE GROUP of Dental Hospitals Pvt. Ltd.
Andhra Pradesh | Telangana | Karnataka | Kuwait
RTC బస్టాండ్ దగ్గర, రమేష్ రెడ్డి నగర్, నెల్లూరు. ఫోన్: 92464 34447



స్త్రీశక్తి.. సంబరం

ఆర్టీసీలో ఉచిత ప్రయాణంపై అతివల ఆనందం

"భలే ఉందయ్యా.. ఆర్టీసీ బస్సులో ఉచితంగా తిరుగుతామని కలలో కూడా అనుకోలేదు. ఊళ్లకు, గుళ్లకు చార్జీలు లేకుండా వెళ్లొస్తాం. మాలొంటోళ్లకే కాదు.. చదువుకునే అమ్మాయిలకు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకోనే వాళ్లకి, వ్యాపారులకు 'స్త్రీశక్తి' పథకం బాగా ఉపయోగపడుతుందయ్యా.' అంటూ నారీమణులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ఈ పథకం ప్రారంభమైంది. శనివారం అత్యధిక శాతం మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఎవరినోట ఉన్నా ఉచిత ప్రయాణం గురించే చర్చ జరిగింది. మహిళలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందంటూ ఆనందం వ్యక్తం చేశారు. అలాంటి వారిని ఆంధ్రజ్యోతి పలకరించింది.



● తొలిరోజు 3,555 మంది..

స్త్రీశక్తి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత ప్రారంభించింది. అప్పటి నుంచే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభమైంది. తొలిరోజు జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో 3,555 మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆత్మకూరు డిపో పరిధిలో 603, కందుకూరులో 799, కావలిలో 609, నెల్లూరు-1లో 654, నెల్లూరు-2లో 584, రాపూరులో 142, ఉదయగిరి డిపో పరిధిలో 164 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం రూ.1,34,787 లక్షల నగదు ఆర్టీసీ సంస్థకు చెల్లించాల్సి ఉంది. ఇక రెండవరోజు శనివారం సాధారణం కంటే 11 శాతం ఓఆర్ పెరిగింది.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



శార్జీల బాదే లేదు.. శానా సంతోసం!

మాలాంటి పేదోల్లకు 'స్త్రీశక్తి' పథకం వల్ల శానా మేలు జరుగుతాంది. ఇంతకుముందు యాటికన్నా పయానం కావల్లంటే.. 'లెక్క లేదే.. ఎట్లబ్బా..' అని ముందూ ఎనక ఆలోసించేటోల్లం. ఇబ్బుడు ఆ బాదే లేదు. ఆర్టీసీ బస్సెక్కి యా ఊరికి గావల్లంటే ఆ ఊరికి ఎల్లిపావచ్చు. శానా సంతోసంగా ఉండాది. అన్ని రేట్లు శానా పెరిగిపొయిండాయి గదా.. శార్జీ ల్యాకపోతే.. సగం లెక్క మిగిలిపొయినట్లే. సెందరబాబు సారు సల్లంగుండల్ల. ఎవురు ఎట్ల పొయినా.. పెబుత్వానికి మాత్తరం ఆడోల్లందరం అండగా నిలబడతాం.

- ఎన్.సుశీలమ్మ, తిరుమలమ్మపాళెం, వెంకటాచలం మండలం



చదువు మరింత సజావుగా సాగుతుంది

నేను నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాను. ప్రతి సంవత్సరం బస్సు పాస్ కోసం చాలా ఖర్చయ్యేది. ప్రస్తుతం ఉచిత బస్సు వల్ల నాలాంటి ఎంతో మంది పేద విద్యార్థినులకు మేలు జరుగుతుంది. చదువు కూడా మరింత సజావుగా సాగుతుంది. ఆర్టీసీ బస్సులో ఇలా ఉచితంగా ప్రయాణం చేస్తానని నేనెప్పుడూ ఊహించలేదు. చాలా సంతోషంగా ఉంది.

- నెల్లిపూడి హర్షిత, డిగ్రీ విద్యార్థిని, వెంకటాచలం



రూ.500 మిగిలిందయ్యా

ఆర్టీసీ బస్సుల్లోని ప్రతి మహిళ ముఖంలో ఆనందమే. నేను బాకరావుపేట నుంచి నెల్లూరుకు వెళ్తున్నాను. ఒక్కసారి మా ఊరినుంచి నెల్లూరుకు రానుపోను రూ.500 చార్జీ ఖర్చు మిగులుతుంది. స్త్రీశక్తి పథకంతో ప్రతి కుటుంబానికి ఎంతో మేలు చేకూరుతుంది.

- కృష్ణవేణి, బాకరావుపేట



నెల్లూరు నగరంలోని ఇస్కాన్‌సిటీలో ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్‌లు

గోకులకృష్ణా.. గోపాలకృష్ణా...!

● వేడుకగా కృష్ణాష్టమి

ముద్దులొలికే చిన్ని కృష్ణుడి జన్మాష్టమిని జిల్లావాసులు ఉత్సాహంగా జరుపుకున్నారు. శివ-కేశవ ఆలయాల్లో కృష్ణ భగవానుడికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇతర ప్రముఖుల్లో ఆలయాల్లో ఉత్సవర్లను దర్శించుకు న్నారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం ఉత్సాహంగా జరిగింది. ఆయా కార్యక్ర మంలో చిన్నారులు కృష్ణుడు, బలరాముడు, సుభద్ర, గోపికల వేషధారణలతో ఆకట్టు కున్నారు. నెల్లూరులోని ఇస్కాన్ మందిరంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు డాక్టర్ సుఖదేవ స్వామి ఆధ్వర్యంలో ఉదయం రాధాకృష్ణులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలరాములకు ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. కృష్ణాష్టమి వైభవంపై డాక్టర్ సుఖదేవస్వామి ప్రవచనం చేశారు. సాయంత్రం సావనీర్ ఆవిష్కరణ, శ్రీకృష్ణాష్టమి నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం, బాలకృష్ణుడికి ఊంజల్ సేవలు జరిగాయి. 108 వంటకాలతో స్వామివారికి నైవేద్య పూజలు జరిగాయి. రాపూరు మండలం పెంచలకోన క్షేత్రం లక్ష్మీనృసింహస్వామి శ్రీకృష్ణుడి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

- నెల్లూరు, (సాంస్కృతికం)





ఇస్కాన్ మందిరంలో భక్తులు



నెల్లూరులో ఆకట్టుకున్న అలంకరణ


వర్క్ ఫ్రం హోం...

మళ్లీ సర్వే

- గతంలో గుర్తించిన వారి విద్యార్హతల పరిశీలన
- సర్టిఫికెట్లన్నీ కౌశలం యాప్‌లో అప్‌లోడ్
- ఆ తర్వాత వివిధ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వర్క్ ఫ్రం హోం సర్వేను కొత్తగా చేపడుతున్నారు. ఇంటి నుంచే పని విధానాన్ని ప్రోత్సహించి ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి ఏప్రిల్ నెలల్లో ఇంటింటి సర్వే చేయించింది. వివిధ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 50 ఏళ్లలోపు వారి వివరాలు సేకరించారు. ఈ తొలివిడతలో సర్వేలో 7.48 లక్షల మంది ఏ పని లేనివారు ఉన్నారని గుర్తించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి ఇంటికి సచివాయ సిబ్బంది వెళ్లి వివరాలు సేకరించారు. అందులో ఉద్యోగం చేస్తున్నవారి కంటే ఖాళీగా ఉన్న వారి సంఖ్యే ఎక్కువగా ఉండటం ఆశ్చర్యం గొలిపింది. గతంలో చేసిన సర్వేలో వాస్తవాలు నిర్ధారించి ఇంటి నుంచే పనిచేసే (వర్క్ ఫ్రం హోం) అవకాశం కల్పించడానికి ప్రభుత్వ మళ్లీ కొత్తగా సర్వేను చేపట్టింది. గతంలో నిర్వహించిన సర్వేలో వర్క్ ఫ్రం హోంకు సుముఖత తెలిపిన వారిలో ఐటీఐ, డిప్లమో, డిగ్రీ ఆపై విద్యార్హతలున్న వారి పేర్లను ఆటోట్యాగ్ చేసి మండలాల వారీగా గ్రామ, వార్డు సచివాలయాలకు పంపుతారు. వీరి వివరాలను మళ్లీ కౌశలం మొబైల్ యాప్ ద్వారా సర్వే చేస్తారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది అర్హులైన వారి ధ్రువపత్రాలను పరిశీలించి, ఒరిజినల్ ధ్రువపత్రాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తారు.

● జిల్లాలో ఇదీ పరిస్థితి



జిల్లాలో మొత్తం కుటుంబాలు 5,95,817 ఉండగా, జనాభా 25.67 లక్షలు ఉంది. 18-50 ఏళ్లలోపు వారు 12,92,756 మంది ఉన్నారు. గతంలో సర్వే పూర్తయిన వారు 12,92,007, వివిధ వృత్తుల్లో ఉన్నవారు 2,18,898 మంది ఉన్నారు. ఇంటి నుంచి పనిచేస్తున్న వారు 14,182 మంది ఉన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 1,42,408 కుటుంబాలు ఉండగా, 18 నుంచి 50 సంవత్సరాలలోపు వారు 3,04,007 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరిలో వివిధ రకాల పనులు చేస్తున్నవారు 60,548 మంది ఉండగా, వర్క్ ఫ్రం హోంలో 5,176 మంది ఉన్నారు. ఏ పని లేకుండా ఉన్నవారు కావలిలో 30,555 మది, బుచ్చిలో 24,178, పొదలకూరులో 24,178 మంది ఉన్నారు. అత్యల్పంగా సీతారాంపురంలో 6,602, వరికుంటపాడులో 8,422 మంది, దుత్తలూరులో 8,560 మంది ఉన్నట్లు గుర్తించారు.

● కొత్త సర్వే ఇలా...

జీఎస్‌డబ్ల్యుఎస్ ఎంప్లాయీస్ మొబైల్ అప్లికేషన్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. గత సర్వేలో సేకరించిన జాబితాలో పేర్లు ఉన్న వారి ఆధార్, మొబైల్, ఈ మెయిల్ ఓటీపీ ద్వారా పకడ్బందీగా సర్వే చేపడుతున్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, చదివిన సంవత్సరం, కోర్సు వివరాలు, వచ్చిన మార్కులు తదితరాలను పరిశీలిస్తారు. ఆ తర్వాత ధృవపత్రాలను కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. అర్హులందరికీ సాంకేతిక శిక్షణ అందించి పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొంటోంది.



వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం

ప్లాస్టిక్ రహితంగా ఆలయాలు

● అమలుకు పకడ్బందీ ప్రణాళికలు



ఉదయగిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆలయ ప్రాంగణాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం విధించారు. ఈ నిబంధన పకడ్బందీగా అమలు చేయాలని రాష్ట్ర దేవదాయ శాఖ ఆదేశాలు జారీ చేయడంతో అమలుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయంతోపాటు జిల్లాలోని జొన్నవాడ, పెంచలకోన, బిట్రగుంట, గొలగమూడి, మాలకొండ నెల్లూరులోని రాజరాజేశ్వరిదేవి, రంగనాయకుల స్వామి తదితర ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. అదేస్థాయిలో ప్లాస్టిక్ వినియోగం కూడా ఉంటోంది. ఆలయాలకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకుం డా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నారు. అన్నప్రసాదానికి అరిటాకు, ప్లాస్టిక్ రహిత వాటిల్లో అందించేందుకు చర్యలు తీసుకొంటున్నారు. స్వామివారి ప్రసాదం, ఇతరత్రా వాటిని భక్తులకు అందించేందుకు ఆకులతో తయారు చేసిన ప్లేట్లను ప్రవేశపెట్టనున్నారు. ముఖ్యంగా 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉండే ప్లాస్టిక్ సంచుల వినియోగం పూర్తిగా నిలిపివేసి వాటి స్థానంలో సులువుగా మట్టిలో కలసిపోయే నార, వస్త్రం, కాగితం సంచులను వినియోగంలోకి తేనున్నారు. అలాగే ఆలయ ప్రాంగణాల్లో ప్లాస్టిక్ నిషేధం అమలుపై బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

అమలుకు చర్యలు

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకుంటాం. వాటర్ ప్యాకెట్లు, నీళ్ల సీసాల వినియోగం లేకుండా చూస్తాం. ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాలను భక్తులకు అవగాహన కల్పించడంతోపాటు ఆలయ పరిసర ప్రాంతాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తాం.

- వెట్టిగుంట ఉషశ్రీ, ఈవో, నర్రవాడ

- రైలు డోరు నుంచి జారి పడి ఇద్దరు స్నేహితుల మృతి
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబసభ్యులు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

మరణంలోనూ వీడని స్నేహం



పోలయ్య (ఫైల్)



అర్షద్ (ఫైల్)

నెల్లూరు(క్రైం) ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మరణంలోనూ వారు స్నేహాన్ని వీడలేదు...స్నేహితుడి కుమార్తె ఫంక్షన్‌కు వెళుతూ ఇద్దరు మిత్రులు ప్రమాదవ శాత్తూ రైలు డోర్ నుంచి జారిపడి మృతి చెందారు.ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు, తిరుపతి జిల్లా గూడూ రు మండలం చెన్నూరుకు చెందిన పోలయ్య (24), అర్షద్ (19), వెంకటేష్ స్నేహితులు. పోల య్య ప్రైవేటు స్కూల్ వ్యాన్‌క్లీనర్‌గా, అర్షద్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్నేహితుడు తమ్ముడి కుమార్తె ఫంక్షన్ కోసం ఈ ముగ్గురూ ఈనెల 14న రైలులో విజయ వాడకు బయలుదేరారు. పోలయ్య, అర్షద్ బోగీ డోర్ వద్ద కూర్చుని మాట్లాడు కుంటున్నారు. నెల్లూరు కొండాయపాలెం గేటు సమీపంలో ప్రమాదవశాత్తూ వారిద్దరూ రైలులో నుంచి జారిపడ్డారు. కొద్దిసేపటి తర్వాత వెంకటేష్ వారి కోసం రైలులో చూడగా కన్పించలేదు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో రైలు దిగి వారి కోసం గాలించాడు. ఆచూకీ తెలియక పోవడంతో చెన్నూరుకు వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియ చేశాడు. అందరూ కలిసి వారి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఈనెల 15న నెల్లూరు కొండాయపాలెం గేటు సమీపంలో రైలు పట్టాలపై నుజ్జునుజ్జుగా మారిన మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం కొండాయపాలెం గేటు సమీపంలో చెట్లలో దుర్గంధం వస్తుండటాన్ని రైల్వే సిబ్బంది గమనించారు. చెట్లలో పరిశీలించగా ఓ మృతదేహం కన్పించింది. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబసభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడు అర్షద్‌గా గుర్తించారు. జీజీహెచ్ మార్చురీలో ఉంచిన మృతదేహాన్ని రైల్వే పోలీసులు చూపించగా పోలయ్యగా గుర్తించారు. మార్చురీ వద్ద మృతుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

మాలకొండకు పోటెత్తిన భక్తులు

● ప్రత్యేక దర్శనానికి 3 గంటల సమయం

వలేటివారిపాలెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి సుమారు 3 గంటలకుపైగానే సమయం పట్టింది. తెల్లవారుజాము నుంచే క్యూలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శుక్ర, శని, ఆదివారాలు సెలవు రోజులు కావడం, శ్రావణమాసంలో 3వ శనివారం కావడంతో మాలకొండకు భక్తులు తరలివచ్చారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కాగా, శనివారం భక్తుల నుంచి రూ.16,30,248 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా అన్నదానం ద్వారా రూ. 6,26,957, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.5,52,900, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,80,960 ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

మౌనికకు డాక్టరేట్ ప్రదానం



వెంకటాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీ మెరైన్ బయాలజీ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని కే మౌనికకు శనివారం వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. నెల్లూరు నగరానికి చెందిన మౌనిక 'మానిటరింగ్ ఆఫ్ హెవీ మీటల్స్ కాంటమినేషన్ ఇన్ కమర్షియల్లీ ఇంపార్టెంట్ ఫిష్ అండ్ ప్రాన్స్‌స్పెసస్ కలెక్టెడ్ ఫ్రమ్ నెల్లూరు కోస్ట్' అనే అంశంపై డాక్టర్ ఎం హనుమారెడ్డి పర్యవేక్షణలో సమగ్రంగా పరిశోధన చేశారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9553
వెండి కిలో ధర	రూ. 117500
వెండి ఒక గ్రాము	రూ. 120.50



పోతురాజు ముగ్గులో పాల్గొన్న భక్తులు

వైభవంగా రాపూరమ్మ జాతర

రాపూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాపూరమ్మ దీవెనలు అందరిపై ఉండాలని భక్తులు మొక్కుకున్నారు. సాంప్రదాయ బ ద్ధంగా సామూహిక పూజలు నిర్వహించా రు. పట్టణంలో రాపూరమ్మ జాతర రెం డో రోజు శనివారం వైభవంగా జరిగింది. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అ లంకరించారు. పోతురాజు ముగ్గువేసి సం ప్రదాయం ప్రకారం గ్రామ పెద్దగొల్ల మాత మ్మ వివాహాన్ని జరిపారు. అనంతరం ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. సాయంత్రం గంగ పెట్టి ఊరేగింపు నిర్వ హించి వీర తాళ్లతో చిందేశారు.

పొదలకూరు ఆర్టీసీ బస్టాండుకు కొత్త శోభ!

● అద్దెకు వ్యాపార దుకాణాల ఏర్పాటు

పొదలకూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : మొన్నటిదాకా దట్టమైన కంప చెట్లతో నిండిపోయిన ఉన్న ఆర్టీసీ బస్టాండ్ నూతన సొబగులు అద్దుకుంది. 1996లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి టి. దేవేంద్రగౌడ్ ఈ ఆర్టీసీ బస్టాండును ప్రారంభించారు. పట్టణంలోని పంచాయతీ బస్టాండ్‌కు కిలోమీటర్ దూరంలో ఉండే ఈ ఆర్టీసీ బస్టాండుకు అప్పట్లో బస్సులన్నీ ఇక్కడికే వచ్చి ప్రయాణికులను ఎక్కించుకునేవి. కాలక్రమేణా పట్టణానికి బస్టాండు దూరం కావడంతో ప్రయాణికుల రద్దీ తగ్గిపోయింది. దీంతో బస్సుల రాకపోకలు కూడా తగ్గిపోయాయి. అప్పట్లో నేరుగా నెల్లూరు నుంచి తిరుమలకు వెళ్లే బస్సులో సీట్ల కోసం ఆర్టీసీ బస్టాండు వద్దకు వచ్చి ఎక్కేవాళ్లు. అంతకుమించి అక్కడికొచ్చి బస్సు ఎక్కేందుకు ప్రయాణికులు మొగ్గుచూపేవారు కాదు. దీంతో దాదాపు దశాబ్ద కాలంగా ఈ బస్టాండ్ నిరుపయోగంగా ఉండేది. అయితే ఇటీవల నెల్లూరు జిల్లా ఆర్టీసీ జోన్ చైర్మన్ సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు ప్రత్యేక చొరవ చూపించి ఆర్టీసీ బస్టాండును అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సుల రాకపోకలు తప్పనిసరి చేశారు. అలాగే ప్రతి రోజూ పొదలకూరు సమీప గ్రామాల నుంచి నెల్లూరుకి వెళ్లేందుకు



ఆకర్షణీయంగా పొదలకూరు ఆర్టీసీ బస్టాండు

అనుకూలంగా తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు బస్సును ప్రారంభించారు. బస్టాండ్ చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి, ఓ ప్రైవేటు వ్యక్తికి 15 ఏళ్లపాటు ఆ స్థలాన్ని లీజ్‌కు ఇచ్చారు. ఆ స్థలంలో వివిధ దుకాణ సముదాయాన్ని నిర్మిస్తున్నారు. లీజుకు దక్కించుకున్న ఆ వ్యక్తి మట్టి తోలించి అక్కడ దుకాణాల నిర్మాణం చేపట్టాడు. ఆర్టీసీ బస్టాండుకు రంగులు వేయించడంతో కొత్త శోభ వచ్చింది. ఎలక్ట్రానిక్ బోర్డులను సైతం పెడుతున్నారు. కొత్త కుర్చీలను ఏర్పాటు చేశారు. పొదలకూరు పట్టణ జనాభా బాగా పెరగడం, చుట్టుపక్కల ఇళ్లు ఏర్పడడంతో ఆర్టీసీ బస్టాండ్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చారు. దీంతో ఆర్టీసీ బస్టాండుకు పూర్వ వైభవం వస్తుందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బలవంతపు భూసేకరణ తగదు!



గోడ పత్రికను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

ముత్తుకూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : కరేడు భూముల బలవంతపు భూసేకరణకు పాల్పడడం తగదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నక్క రాదయ్య తెలిపారు. ముత్తుకూరు శ్రామిక భవనంలో శనివారం ప్రజా సంఘాల నాయకులు 'ఛలో కరేడు' గోడ పత్రికను విడుదల చేశారు. ఆగస్టు 18న 'ఛలో కరేడు' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కృష్ణపట్నం క్లస్టర్ అధ్యక్షుడు గడ్డం అంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దుంపల ఏడుకొండలు, సీఐటీయూ నాయకులు షేక్ మస్తాన్‌షా, మహిళా సంఘం జిల్లా ఉపాధ్య క్షురాలు మన్నే పద్మమ్మ పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం



తహసీల్దారును సత్కరిస్తున్న నాయకులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 15న నెల్లూరులో మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ ఓ. ఆనంద్ చేతులమీదుగా అవార్డు అందుకున్న బుచ్చి తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లును పలువురు నాయకులు శనివారం సత్కరించారు. మినగల్లు టీడీపీ నాయకుడు, కోటంరెడ్డి సురేష్ రెడ్డి, పంచేడుకు చెందిన పెనాక అమర్నాథ రెడ్డి, సీహెచ్ వినయ్ నారాయణ, బైనబోయిన శ్రీనివాసులు, కావలి వెంకటేశ్వర్లు, ఆర్ఐ శాంతిప్రియ, వీఆర్వోలు సుష్మ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

హే కృష్ణా.. ముకుందా.. మురారీ

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుకలు

రాపూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోన పెనుశిల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీకృష్ణుని అవతారంలో ఉత్సవమూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని శ్రీరాధా సమేత గోపాలకృష్ణ మందిరంలో ఉదయం కృష్ణుడి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, విశేష పుష్పాలంకరణ చేసి పూజలు చేశారు. రాధాగోపాల తిరుకల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపారు. శ్రీకిరెడ్డి శశిరెడ్డి ఉభయ దాతలుగా వ్యవహరించారు. భక్తులు పెద్దఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు.

విడవలూరు : మండలంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభంగా జరిగాయి. విడవలూరు, రామతీర్థం, చౌకిచర్ల, ముదివర్తి, ఊటుకూరు గ్రామాల్లోని వైష్ణవ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లో శ్రీకృష్ణుని కళ్యాణ వేడుకలు నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు.

మనుబోలు : మనుబోలులో పూర్వం నుంచి గణేష్ ఆలయం వద్ద యాదవులు కృష్ణాష్టమి రోజున ఉట్టి మహోత్సవం ఆనవాయితీగా ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో శనివారం చిన్నారులంతా ఉట్టి కొట్టేందుకు ఆసక్తి చూపారు. ఆబాలగోపాలం శ్రీకృష్ణుడికి పూజలు చేశారు.

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక పైడావారి వీధి, జొన్నవాడ, పెనుబల్లి, కాళకాగొల్లు, శ్రీరంగరాజపురం, రెడ్డిపాళెం, రేబాల, దామరమడుగు, విలియమ్స్‌పేట, పంచేడు తదితర గ్రామాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తితో నిర్వహించారు. పలుచోట్ల ఉట్టి కొట్టి గ్రామోత్సవాలు జరిగాయి. పుట్టవీధి, హౌస్‌తోటలో త్రైత సిద్ధాంత ట్రస్టు



రాపూరు : శ్రీకృష్ణుని అవతారంలో పెంచులోరు



మనుబోలులో ఉట్టిమహోత్సవంలో చిన్నారులు

అధ్వర్యంలో వేడుకలు మూడురోజులపాటు జరగనున్నా యని ప్రబోధసేవాసమితి, హిందూ జ్ఞానవేదిక సభ్యులు తెలిపారు. పలు మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అన్నదాన కార్యక్రమాలు చేశారు.

వెంకటాచలం : స్థానిక రాధే రాధే శ్రీకృష్ణ మందిరంలో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాధా కృష్ణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేయించారు. భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కోలాటం, పండరి భజన కార్య క్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల శ్రీకృష్ణ, రాధాదేవి వేషధారణ, పెద్దల కోలాటం అలరించాయి. కోనేరు శ్రీకాంత్, లలిత దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మనోజ్ గుప్తా, వరదగల్లు హరిబాబు, మందిపాటి రమేష్ బాబు, గజ్జల శంకరమ్మ, పుత్తూరు వెంకటరత్నం, చల్లా రమ ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరు: శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని శనివారం భక్తులు ఉత్సాహంగా జరుపుకొన్నారు. ఆలయాలను పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ముత్తుకూరులోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఉన్న కృష్ణ మందిరంలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. భజనలతో ఆలయాలు మార్మోగాయి. పూజారులు అభిషేకాలు నిర్వహించారు. పిల్లలు శ్రీకృష్ణ వేషధారణలో దర్శనమిచ్చారు. జన్మాష్టమి రాత్రి కృష్ణలీల, గోపికల ఆటలు, నాటికలు ఆకట్టుకున్నాయి.

పొదలకూరు: పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి మహా నైవేద్యం సమర్పించారు. హరినామ సంకీర్తనలు ఆలపించారు. చిన్నారులు కృష్ణవేష ధారణలో ఆకట్టుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విజేతలను అభినందించిన వేమిరెడ్డి దంపతులు

కోవూరు, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నేపాల్‌లో జరిగిన ఇండో-నేపాల్ ఇన్విటేషన్ అసోసియేషన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజయం సాధించిన పాటూరు గ్రామానికి చెందిన యువకులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శనివారం అభినందించారు. అండర్ 19 ఛాంపియన్ షిప్ పోటీల్లో గౌతమ్, రామచరణ్ విజయం సాధించారు. వీరికి వేమిరెడ్డి దంపతులు ఆర్థిక సాయం అందించారు. తాము సాధించిన కప్పులతో ఆ యువకులు వేమిరెడ్డి దంపతుల్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



యువకులను అభినందిస్తున్న వేమిరెడ్డి దంపతులు

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వేదాయపాళెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. మండలంలోని పూడిపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో బాలబాలికల విభాగాల్లో టాపర్లుగా నిలిచిన నాసిన మదన్, ఆత్మకూరు జనితలకు రూ.5116 నగదు ప్రోత్సాహకాన్ని కోడూరు సుమేధ్‌కుమార్ అందించారు. అలాగే నాసిన మదన్‌కు రూ.2116, పర్వతాల శివసాయికి రూ.1500 చొప్పున దువ్వూరు నరేంద్రరెడ్డి అందించగా ఆ నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే విద్యార్థులకు అందజేశారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు వారికి ప్రోత్సాహకాలు అందించిన దాతలను సైతం ఎమ్మెల్యే అభినందించారు.



కర్ణాటక AC బస్సు యాత్ర
మైసూరు, శ్రీరంగ పట్నం, బేలూరు, శృంగేరి, కుక్కి సుబ్రహ్మణ్యం, గోకర్ణం, మరికొన్నిటిలో మా తదుపరి యాత్ర షిర్డీ 7 రో 1టి.రూ.14,400/-. తేది.24-08-2025. సం.ప్ర. బొబ్బల శేషయ్య, సెల్: 98665 27640
AJR-2890

పని మనిషి కావలెను
కావలిలో ఉంటున్న మా అమ్మ (72 సం.)కు వంట & ఇంటి పని చేసేందుకు ఒక మహిళా Care Taker కావలెను. జీతం & భోజన వసతి కల్పించబడును. స్థానికులకు ప్రాధాన్యత కలదు. సం.ప్ర.9550026403
AJR-240556

TOLET
నెల్లూరు టౌన్ హాలు ఎదురుగా ఆఫీసుకు, కోచింగ్ సెంటర్‌లకు బాడుగకు ఇవ్వబడును. సం.ప్ర. సెల్: 99853 12224, 94939 98347
AJR-212030

రైలు యాత్ర
కార్తీకమాసంలో మధ్యప్రదేశ్, గుజరాత్‌లోని 4 జ్యోతిర్లింగాలు, ద్వారకలు చూచుట తే.07-11-25. 12రో.1టి రూ.23,000/-. సం.ప్ర. బొబ్బల శేషయ్య, సెల్: 98665 27640
AJR-2905

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఒక్క రోజు జాలీ టూర్
షోలింగర్, తిరువల్లూరు, తిరుత్తణి, సురుటుపల్లి తేది:23-08-2025. 1 రోటి1కి 1600/- (A/c బస్సు, భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240617

కొల్హాపూర్ రైలు యాత్ర
కొల్హాపూర్, షిర్డి, ముంబై, 3 జ్యోతిర్లింగాలు, పండరీపురం తేది:24-10-25. 6 రో టి1కి 13000/- (రైలు, A/c రూం + A/c బస్సు భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240615

శ్రీధర్ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ
నెల్లూరు నగరంలో ప్లాట్‌లు ఇళ్లు ఇళ్లస్థలాలు అపార్ట్‌మెంట్లు మరియు కమర్షియల్ బిల్డింగ్స్, కమర్షియల్ స్థలాలు, డెవలప్మెంట్ సైట్లు మరియు పొలములు కావలసిన వారు అమ్మదలచిన వారు సంప్రదించండి. కమర్షియల్ బిల్డింగ్స్ రెంటుకి కావలసిన వారు ఇవ్వదలచిన వారు మాతో సంప్రదించండి. హంస శ్రీధర్, సెల్: 98663 22989
AJR-212029

ఎమ్మెల్యేను కలిసిన రామచంద్రాపురంవాసులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ 20వవార్డు పరిధిలోని రామచంద్రాపురాన్ని కోవూరు ఎమ్మెల్యే దత్తత తీసుకోవడంపై స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యేని నెల్లూరులోని తన నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం గ్రామంలోని సమస్యల గురించి ఎమ్మెల్యేకి వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొలగట్ల రామచంద్రారెడ్డి, బీజేపీ నాయకుడు గోలి సురేంద్ర, వార్డు ఇన్‌ఛార్జ్ టీడీపీ నాయకుడు చలంచర్ల సునీల్, బూత్ ఉపాధ్యక్షుడు యరగల కోటయ్య వున్నారు.

ఘనంగా మాతమ్మ గ్రామోత్సవం

మనుబోలు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిడూరు గ్రామంలో శనివారం మాతమ్మ విగ్రహంకు గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని మిక్సిడ్ కాలనీలో చందాలు వసూలు చేసుకుని అరుంద తీయులు మాతమ్మ గుడిని నిర్మించుకున్నారు. ఇందులో మాతమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు రెండురోజులుగా నిర్వహిస్తున్నారు. శనివారం గుడి ప్రక్కనే యాగశాలలో వేదపండితులు సునీల్‌శర్మ ఆధ్వర్యంలో ఋత్వికులు హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠ చేయబోయే మాతమ్మ విగ్రహంకు, శిఖరం, పోతురాజు శిలలకు క్షీర, పంచామృతాలు, సుగంధద్రవాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ పెద కాపు మోడెం కృష్ణమోహన్‌రెడ్డి, నీలిమ దంపతులు అమ్మవారికి సారెలు సమర్పించారు. మాజీ సర్పంచు మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి ప్రతిష్ఠ కార్యక్రమాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై

25న విజయవాడలో మహాధర్నా

బుచ్చిరెడ్డిపాళెం.ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మెమో 57ను అనసరించి అర్హతగల ఉపాధ్యాయులు, పోలీసులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శనివారం బుచ్చిలోని మండల విద్యాశాఖ కార్యాలయం ముందు ఉపాధ్యాయుడు ఉస్మాన్, బీమతాటి రమణయ్య, పలువురు ఉపా ధ్యాయులు నినాదాలతో నిరసనతో వ్యక్తం చేశారు. 2003లో పలు వుద్యోగ నియామకాలకు నోటిఫికేషన్‌ఇచ్చి 2005లో నియామకాలు చేపట్టడంవల్ల రాష్ట్రవ్యాప్తంగా 11 వేల మంది ఉపాధ్యాయ వుద్యోగులను సపీఎస్‌లోకి నెట్టిందన్నారు. ప్రభుత్వం తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ. ఈనెల 25న విజయవాడ అలంకార్ సెంటర్లో చేపట్టే మహాధర్నాను జయప్రదంచేయాలని కోరారు.

బ్యాగులు, పుస్తకాల పంపిణీ



మనుబోలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లి ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులకు శుక్రవారం బ్యాగులు, రాతపుస్తకాలను దాతలు అందజేశారు. ఆ పాఠశాల ఉపాధ్యాయుడు మస్తానయ్య స్పిక్ అండ్ గ్రీన్‌స్టార్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులైన యు. అభిజిత్, గోపాల్‌నాయక్‌లను కలిశారు. కంపెనీ తరపున పాఠశాలకు సాయం చేయాలని కోరారు. దీంతో వారు 60 మంది పిల్లలకు బ్యాగులు, రాతపుస్తకాలను అందించారు. జి. వెంకటేశ్వర్లు, పొట్టేళ్ళ ప్రసాద్‌లు ధన్యవాదములు తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

భార్యతో చనువుగా ఉంటున్నాడని కిరాతకంగా యువకుడి హత్య

● ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు

నెల్లూరు (క్రైం) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో చనువుగా ఉంటూ తనను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కక్ష పెంచుకొని, పక్కా ప్రణాళికతో నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్ సమీపంలో ఓ యువకుడిని దారు ణంగా హత్య చేశారు. ఈ కేసులోని నిందితుల వివరాలను శనివారం చిన్నబజారు పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మీడియాకు వెల్లడించారు. నగరంలోని సీఎఎం స్కూల్ ఎదురుగా కసాయివీధిలో షేక్ లైక్(35), రేష్మ దంపతులు కాపురం ఉంటున్నారు. వారికి రోషన్ జమీర్, రూమాన్ కుమారులు. లైక్ తన అన్న రఫీతో కలిసి క్యాటరింగ్ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం లైక్ పాల ప్యాకెట్లు కోసం బైక్‌పై అలంకార్ సెంటర్‌కు వెళ్లాడు. పాల ప్యాకెట్లు తీసుకుని బయలు దేరుతుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డుకొని కత్తులతో పొడవబోయారు. లైక్ బైక్‌ను వదిలేసి సమీపంలోని విక్టోరియా గార్డెన్ వీధిలోకి పరుగులు తీయడంతో నిందితులు వెంబడించారు. అనంతరం వారు లైక్‌ను కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేసి పరార య్యారు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వ రరావు సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సాంకేతికత ఆధా రంగా నగరంలోని కోటమిట్ట, మెక్లెన్స్ రోడు ప్రాంతానికి చెందిన సయ్యద్ నూరుద్దీన్ ఉరఫ్ బాష, వైఎస్ఆర్‌నగర్ పుట్టవీధికి చెందిన షేక్ ఉస్మాన్ ఉరఫ్ దావులు హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో నిందితులు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో ఇళ్ల ఎదురుగా ఖాళీ ప్రదేశంలో ఉన్నారన్న సమాచారంతో వారిని శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బైక్, హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకు న్నారు. లైక్ వద్ద నూరుద్దీన్ పనిచేసేవాడు. మృతుడు లైక్ ముద్దాయి నూరుద్దీన్ భార్యతో చనువుగా ఉండటానికి ప్రయత్నిస్తూ, ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తు ఉండటంతో కక్ష పెంచుకొని తన స్నేహితుడితో కలిసి హత్య చేసినట్లు విచారణలో నూరుద్దీన్ తెలిపాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, ఎస్ఐలు ఏ. అయ్యప్ప, అబ్దుల్ రజాక్, క్రైమ్ పార్టీ హెడ్‌కానిస్టేబుళ్లు సురేష్, నజ్మల్ హుస్సేన్, కానిస్టేబుళ్లు శ్యామ్, సుబ్బారావు, రియాజ్, వదర్దన్, మొహమ్మద్‌లను ఎస్పీ అభినందించారు.

స్కూటీ, మోటారుసైకిల్ ఢీ

● ఇద్దరికి గాయాలు

కావలిరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్కూటీ, మోటారుసైకిల్ ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం ముసునూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ట్రంక్‌రోడ్డుపై జరి గింది. స్థానికుల వివరాల మేరకు.. కావలి పట్టణం బాల క్రిష్ణారె డ్డినగర్‌కు చెందిన నవులూరి బాబురావు ఆంజనేయస్వామి ఆల యంలో పూజారిగా పనిచేస్తున్నారు. దీంతో ఆలయానికి వెళ్లేందు కు స్కూటీపై ఇంటి నుంచి బయలుదేరాడు. అలాగే ముసునూరుకు చెందిన వీ మహేంద్రబాబు మోటారుసైకిల్‌పై పట్టణంలోకి బయలు దేరాడు, మార్గమధ్యంలో ఆలయం సమీపంలో పూజారి బాబురావు రోడ్డు క్రాస్ చేస్తుండగా స్కూటీ, మాటారుసైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం



రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్ర జ్యోతి : కావలి- వెంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ల మధ్యన దిగువ మార్గంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని సుమారు 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచార మిచ్చారు. పోలీసుల వివరాల మేరకు.. రైలు పట్టాలపై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి శుక్రవారం రాత్రి రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా మృతుడి వద్ద చెన్నై నుంచి హౌరాకు రైల్వే టికెట్ తప్ప ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు బ్లూ చుక్కల తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ చొక్కా, తెలుపురంగు కట్ బనీన్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి జీఆర్పీ ఎస్ఐ కే.వెంకట్రావు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కావలిరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తేలుకాటుకు గురై తాటి చెట్టుపై నుంచి కింద పడి గాయపడి చికిత్స పొందుతుండిన బాలుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గౌరవరం గిరిజన కాలనీకి చెందిన చౌటూరి చిన్నయ్య పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో ఉన్న ఓ వాటర్ ప్లాంట్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు శ్రీనివాసులు(11) 5వ తరగతి చదువుతూ మధ్యలో మానేచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీ వారి ఇంటికి సమీపంలోని పొలాల్లో తాటి పండ్ల కోసం తాటి చెట్టు పైకి ఎక్కి కాయలు కోస్తుండగా తేలుకాటుకు గురై కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన ఆ బాలుడిని స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 15వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. మృతుని తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బాలకృష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

వెంకటాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందినట్లు శనివారం పోలీసులు తెలిపారు. ఈనెల 10వ తేదీన బుజబుజ నెల్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు పక్కన చెట్టు కింద ఓ గుర్తు తెలియని వృద్ధుడు(75) కదల్లేని స్థితిలో పడి ఉండగా, స్థానికులు 108 వాహనంలో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

నెల్లూరు (జడ్పీ), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కొండాయపాళెం సబ్‌స్టేషన్ పరిధిలోని ఫోర్ ఇన్ వన్ డీసీ మాడ్యూల్ యూనిట్ ఏర్పాటు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎం శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి ఉదయం 11.45 గంటల వరకు స్నేహనగర్, కావేరినగర్, కొండాయపాళెం, అంబర్ వుడ్ స్కూల్ ఏరియా, బ్యాంకు కాలనీ, నక్కలగుంట, ఎల్ఐసీ కాలనీ, సంఘమిత్ర స్కూల్ పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

విజేతలకు అభినందనలు

నెల్లూరు(హరనాథపురం, ఆంధ్రజ్యోతి) : ఇటీవల నేపాల్‌లో జరిగిన ఇండో-నేపాల్ ఇన్విటేషనల్ అసోసియేషన్ చాంపియన్‌షిప్ టోర్నీలో విజయం సాధించిన ఇండియా అండర్-19 విజేతలను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులు శనివారం అభినందించారు. ఆ టీమ్‌లో 14 మంది ఉండగా, వారిలో కోవూరు మండలం పాటూరుకి చెందిన గౌతమ్, రామ్‌చరణ్ ఉన్నారు. వీరిద్దరికి వేమిరెడ్డి దంపతులు ఆర్థిక సహాయాన్ని అందచేశారు.

న్యూస్ బాక్స్



ఆలయం వద్ద మెట్లతో ఏర్పాటు చేసిన తాటిచెట్టు

సౌత్‌మోపూరులో మేడ మెట్ల ఉత్సవం

నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరులో జరుగుతున్న మాతపరమేశ్వరి ఉత్సవాల్లో భాగంగా శనివారం మేడ మెట్ల ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో తాటిచెట్టుకు పసుపు పూసి మెట్లు ఏర్పాటు చేసి అనంతరం పైనుంచి తినుబండారా లను విసిరి ఉత్సవాన్ని మొదలుపెట్టారు. కోర్కెలు కోరేవారు వాటిని తింటే ఆ కోర్కెలు తీరుతాయన్న నమ్మకంతో తరతరాలుగా ఈ ఆచారం వస్తుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి. తమ అనంతరం అమ్మవారు గ్రామోత్సవానికి సిద్ధమయ్యారు.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

అల్పాహారం పంపిణీ

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వియానీ హోమ్‌లోని పిల్లలకు శనివారం పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సభ్యులు బషీర్ మనుమరాలు అమినుల్‌నిద పుట్టినరోజు సందర్భంగా అల్పాహార పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రసూల్ మాట్లాడుతూ అనాథలు, అభాగ్యులు, నిరాదరణకు గురైన పిల్లల మధ్య పుట్టినరోజు నిర్వహించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అన్వర్‌బాషా, మోమిన, మహబూబ్ బషీర్, మములాల్ జాన్, జిలాని బాషా, పీఎంపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. వేణుగోపాల్, శేషయ్య పాల్గొన్నారు.

సీఐకి సత్కారం



చిట్టెం కోటేశ్వరరావును సత్కరిస్తున్న ఖాసీం తదితరులు

నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ సేవలకుగానూ స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి నారాయణ చేతుల మీదుగా ఉత్తమ పోలీసు అధికారిగా అవార్డు అందుకున్న చిన్నబజారు పోలీసు స్టేషన్ సీఐ చిట్టెం కోటేశ్వరరావును భారత్‌సేవా ఫౌండేషన్ కార్యదర్శి షేక్ ఖాసీం శనివారం శాలువాతో సత్కరించి మిఠాయిలు అందచేశారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మల కృష్ణయ్య, హరిశ్చంద్ర, ఖుద్దూస్ పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ



క్యాన్సర్ బాధితులకు న్యూట్రిషన్ ఫుడ్ అందిస్తున్న దాతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని కొండాయపాలెం గేటుసెంటర్ వద్ద ఉన్న అబైడింగ్ హోమ్ చర్చిలో శనివారం టైటస్ నిర్మల్ కుమార్ దాతృత్వంతో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ క్యాన్సర్ రోగులకు న్యూట్రిషన్ ఫుడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలకుమార్, సమాజ సేవకురాలు జయమ్మ, విలియమ్స్ ప్రశాంత్‌గౌడ్, హేమచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా కృష్ణాష్టమి వేడుకలు

నెల్లూరు (సాంస్కృతికం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని క్రాంతినగర్ ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం కృష్ణ భగవానుడికి విశేష అభిషేకాలు జరిగాయి. సాయంత్రం ఉట్టి మహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు కృష్ణుడు, బలరాముడు, సుభద్ర, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం చైర్మన్ దర్శిగుంట పెంచలయ్య, దేవస్థానం ట్రస్ట్ సభ్యులు పర్యవేక్షించారు.

● కన్నుల పండువగా కల్యాణం

గాంధీనగర్ కృష్ణమందిరంలో శనివారం కృష్ణాష్టమి సందర్భంగా రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. అర్చకులు బీ.శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణ విశేషాలను వివరిస్తూ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణదాతలు, ఉభయకర్తలు, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● హనుమాన్ జంక్షన్‌లో...

కొండాయపాలెం హనుమాన్ జంక్షన్‌లో బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో చిన్నారులు దేవతామూర్తుల వేషధారణతో తరలివచ్చారు. ఈ సందర్భంగా భజనలు, కీర్తనలు కచేరి జరిగింది.

● ఉడయవర్లు దేవస్థానంలో..

నవాబుపేట ఉడయవర్లు దేవస్థానంలో కృష్ణాష్టమి వేడుకల్లో ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం కృష్ణస్వామికి విశేష అలంకారం, పూజలు అనంతరం వయ్యారనడసేవలతో ప్రాకార ఉత్సవం జరిగింది. కార్యక్రమాలను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పల్లాప్రోలు రామకృష్ణమాచార్యులు పర్యవేక్షించారు.



ప్రసన్న వేంకటేశ్వరుడికి పల్లకీసేవ

● డైకస్‌రోడ్డులో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీల ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి విగ్రహం ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



కన్యకా పరమేశ్వరి ఆలయంలో జన్మాష్టమి అలంకారం

● గురువాయురప్పన్ ఆలయంలో..

అయ్యప్పగుడిలో వెలిసి వున్న గురువాయుర్ మహావిష్ణువుకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా అభిషేకాలు, విశేష పూజలు, విశేష అలంకరణలు జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.కార్యక్రమాలను చైర్మన్ శేషగిరిరావు, కార్యదర్శి కేవీ రత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షించారు.

● బాలాజీనగర్‌లో..

బాలాజీనగర్ సెంటర్‌లో చిరంజీవి సేవా సమితి, బాలాజీనగర్ యూత్ సంయుక్తంగా కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృష్ణాష్టమి వేడుకలు, ఉట్టి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాం తిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కృష్ణ మందిరాన్ని ప్రారంభించారు. రాధాకృష్ణుడు, మహా శివుడు, నెమలి విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఉట్టి మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉచ్చి భువనేశ్వరిప్రసాద్, జనసేన నాయకులు, ఆకుల హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదివారం మధ్యాహ్నం వస్త్రదానం, రాత్రి చిన్నారుల నృత్య ప్రదర్శనలు జరుగుతాయని కొట్టే వెంకటేశ్వర్లు తెలిపారు.

● వేణుగోపాలుడిగా ప్రసన్న వేంకటేశ్వరుడు

మాగుంట లేఅవుట్ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. అభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ జరిగాయి. రాత్రి స్వామివారికి పల్లకీ సేవ జరిగింది.

● కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

స్టోన్‌హౌస్‌పేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మురళీకృష్ణ భక్త బృందం ఆధ్వర్యంలో తులసీదళ అర్చన, విశేష పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహఖ అధ్యక్షుడు మేగు షణ్ముఖరావు, కార్య దర్శి చిరంజీవి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

● నెల్లూరు రూరల్‌లో...

నెల్లూరురూరల్,ఆగస్టు 16, (ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లో శనివారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణమందిరాల్లోనూ,ప్రధాన ఆలయాల్లోనూ విశేష పూజలు చేశారు. బుజబుజ నెల్లూరులోని శేషు స్కూల్లో చిన్నారులు పలు సన్నివేశాలను చిత్రీ కరిస్తూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కృష్ణుడు, గోపికల వేషధారణాల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు.



కృష్ణాష్టమి వేడుకల్లో చిన్నారుల నృత్యాలు

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘననివాళులు

నెల్లూరు(క్రైం) ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఎస్పీ జీ. కృష్ణకాంత్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాసేవకుడు, రైతు కూలీల హక్కుల పోరాట యోధుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న అని కొనియాడారు.



సర్దార్ గౌతు లచ్చన్నకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

● బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో :

గౌతు లచ్చన్న జయంతిని శనివారం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఘనంగా జరిపారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏపీ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు మాట్లాడుతూ ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న వేమిరెడ్డి దంపతులు

● వీపీఆర్ దంపతుల నివాళులు

లచ్చన్న చిత్రపటానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు శనివారం వారి నివాసంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన మన అందరికీ ఆదర్శ ప్రాయులన్నారు.

● గౌడ సంఘం ఆధ్వర్యంలో..

లచ్చన్న జయంతిని గౌడ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఒక హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. లచ్చన్న చిత్రపటానికి వారు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సీనియర్ నేత, ఉదయగిరి నరసింహులు గౌడ్, మాలమహానాడు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య, రాష్ట్ర గిరిజన సంక్షేమ సంఘం కన్వీనర్ పాలకీర్తి రవి, గౌడ ఉద్యోగుల సంఘం నేతలు దద్దోలు చక్రపాణి, జై గౌడ జిల్లా అధ్యక్షుడు మన్యం సుబ్రహ్మణ్యం గౌడ్, పుట్టుపల్లి శ్రీరాములు, మాజీ జడ్పీటీసీ మన్యం చిరంజీవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



లచ్చన్న చిత్రపటానికి గౌడ సంఘం నేతల నివాళి

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యే లక్ష్యం

నెల్లూరు(విద్య), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కలిగిన పేదవిద్యార్థులకు కార్పొరేట్ తరహాలో విద్యనందించడమే తన లక్ష్యమని రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని పలు డివిజన్లలో శనివారం ఆయన నగరపాలక సంస్థ పాఠశాలలను పరిశీలించి మాట్లాడారు. మున్సిపల్ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించామని, వచ్చే జూన్ నాటికి నగరంలో 15 ఉన్నత పాఠశాలలను వీఆర్ హైస్కూల్ తరహాలోనే అభివృద్ధి చేస్తానన్నారు. పీ 4 విధానంలో అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో నూతన విద్యా విధానాన్ని అనుసరించి నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే ప్రదేశంలో పాఠశాలలు ఉండేలా చర్యలు చేపడతామన్నారు. నగర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మంచినీటితోపాటు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని త్వరలో పూర్తి చేస్తామన్నారు. అనంతరం మల్లెల సంజీవయ్య పాఠశాలలో కరాటే సాధన చేస్తున్న విద్యార్థులకు మంత్రి మెడల్స్ అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నందన్, టీడీపీ నాయకులు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కే.బాలాజీ, పెంచలయ్య, నాగేశ్వరరావు, ఉచ్చి భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కరాటే క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి నారాయణ

విశ్వకర్మ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : విశ్వకర్మ జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలని జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి, జేసీ కార్తీక్‌కు శనివారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ జీవో-24 ద్వారా విశ్వకర్మ జయంతిని ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించాలని పేర్కొన్నారన్నారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మికి కూడా ఆయన వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు పోలినేని సదాశివ ఆచారి, ఉపాధ్యక్షులు పాలూరు చంద్ర ఆచారి, గజ్జల నాగార్జు ఆచారి, కోరుటూరు వరప్రసాద్ ఆచారి, బాలసుబ్రహ్మణ్యం ఆచారి తదితరులు పాల్గొన్నారు.



జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందచేస్తున్న వెంకట శేషయ్య ఆచారి

రైతులను ఆదుకోండి : మిడతల

నెల్లూరు(వ్యవసాయం), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపు 80వేల ఎకరాల్లో ఎంటీయూ 1010 రకం వరిసాగు చేయగా, ప్రభుత్వం కొనుగోలు చేయనని స్పష్టం చేసిందని బీజేపీ నాయకులు మిడతల రమేష్ పేర్కొన్నారు. రైతులు సాగు చేసిన 1010 రకం ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని వేదాయపాళెంలోని ఆయన కార్యాలయంలో కలిసి మిడతల వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1010 రకం సాగు చేసిన రైతులకు అన్యాయం జరుగుతోందని, మద్దతు ధర కంటే రూ.5వేల నష్టానికి రైతులు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు నరాల సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమిరెడ్డికి రైతుల సమస్యలు తెలుపుతున్న బీజేపీ నేత మిడతల రమేష్

బాబుపై శాపనార్థాలు.. జగన్ ఫ్రస్టేషన్‌కు నిదర్శనం

- పొలంరెడ్డి దినేష్ రెడ్డి

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబును శాపనార్థాలు పెట్టడం వైసీపీ నేత జగన్మోహన్‌రెడ్డి ఫ్రస్టేషన్‌కు నిదర్శనమని రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి విమర్శించారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండటం చూసి భరించలేక జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో జగన్ చేసిన అరాచకాలకు తమ ఓటు ద్వారా ప్రజలు తగిన బుద్ధి చెప్పారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలలో ఇప్పటికే 80 శాతం పూర్తయ్యాయన్నారు. పీ4 విధానంలో బంగారు కుటుంబాలకు చేయూతనందిస్తున్నారని తెలిపారు. పులి వెందుల, ఒంటి మిట్టలలో టీడీపీ ఘన విజయం సాధించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నేతలు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, పెంచలయ్య, బాలారవి, విజయ్ పాల్గొన్నారు.



శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

నెల్లూరురూరల్,ఆగస్టు 16,(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర శివారు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం 24వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో సీసీరోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగర శివారునున్న కాలనీలకు కనీస సౌకర్యాలు ఇప్పుడిప్పుడే అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు. నెల్లూరురూరల్ అభివృద్ధికి నుడా పూర్తి సహకారం అందిస్తుందని చైర్మన్ శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి వద్ద సీసీరోడ్డు నిర్మాణ పనులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అరవ శాంతి, నాయకులు అరవ శ్రీనివాసులు, మదన్‌కుమార్‌రెడ్డి, రాఘవేంద్ర పాల్గొన్నారు. కాగా రూరల్ కార్యాలయానికి వచ్చిన కనీస వేతనాల సలహా బోర్డు చైర్మన్ పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిని కోటంరెడ్డి సోదరులు ఘనంగా సత్కరించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ శ్రీనివాసులురెడ్డి తదితరులు

శ్రీహరిస్వామికి జ్యోతిష్యంలో డాక్టరేట్

నెల్లూరు (సాంస్కృతికం) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన శ్రీహరి స్వామికి జ్యోతిష్యంలో గౌరవ డాక్టరేట్ శనివారం లభించింది. ఆయనకు ఇంటర్నేషనల్ అచీవ్‌మెంట్ అవార్డ్స్, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ, రియల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సంయుక్తంగా అందజేశాయి. తమిళనాడు రాష్ట్రం హోసూరులోని ఫార్చ్యూన్ హోటల్‌లో వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన ప్రముఖులకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన అర్చకులు తెనాలి శ్రీహరిస్వామికి జ్యోతిష్యంలో డాక్టరేట్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గున్నం శ్రీనివాస్, న్యూ సమైక్య మ్యారేజ్ మీటర్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జంగమ్మ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధవళ్ల దశరథరామయ్య పాల్గొన్నారు.



తెనాలి శ్రీహరి స్వామికి సన్మానిస్తున్న నిర్వాహకులు

మందుబాబులకు షెల్టర్

ఈ చిత్రంలో కనిపిస్తున్నది మద్యంషాపు పక్కనే తాగుబోతులకు ఏర్పాటు చేసిన పర్మిట్ రూం అనుకుంటే పొరపాటే. ఇదీ ప్రయాణికుల కోసం ప్రభుత్వం నిర్మించిన బస్‌షెల్టర్. నెల్లూరు - తాటిపర్తి రహదారిలో సౌత్‌మోపూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద దీన్ని నిర్మించారు. కాలక్రమీణా దీన్ని మందుబాబులు తమ అడ్డాగా మార్చుకున్నారు. ప్రస్తుతం ఇదీ మినీబార్‌గా మారింది. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి బస్‌షెల్టర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

- నెల్లూరురూరల్,(ఆంధ్రజ్యోతి)



మందుబాబుల నిలయంగా మారిన బస్‌షెల్టర్

విద్యారంగ సమస్యలపై పోరాటం



పోస్టర్ విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

నెల్లూరు(విద్య), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధమవుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీ.నరేంద్ర తెలిపారు. నగరంలోని బాలాజీనగర్‌లోగల ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విద్యారంగ సమస్యల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థులకు ఇచ్చిన హామీలను, విద్యారంగ సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఈ సమస్యలన్నింటిపై ఈ నెల 22న నగరంలోని ర్యాలీ నిర్వహించి, చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు టీ.విక్రమ్, సభ్యులు ప్రవీణ్, యజ్ఞేష్, సంతోష్ పాల్గొన్నారు.

జనరల్ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా మొదటి క్లయింటు **పచ్చిపాల సుధాకర్ అతని భార్య పచ్చిపాల శైలజ** గారితో కలిసి లోగడ **"శ్రీ తిరుమల వెంకటరమణ రైస్ మిల్"** పేరుతో భాగస్వామ్య వ్యాపారము చేసి ఈ క్రింద కనబర్చిన షెడ్యూలు ఆస్తి ఐటం 1 నుంచి 3 జాయింటు ఫర్మ్ ఆస్తులు కలిగియున్నారు. సదరు **పచ్చిపాల శైలజ** తే.15-05-2025దిన మరణించినారు. కాన సదరు భాగస్వామ్య వ్యాపారము చట్టరీత్యా రద్దు కాబడినది. కాని వారి కుమారుడు **పచ్చిపాల శ్రీనివాసులు** నా మొదటి క్లయింటు సుధాకర్ అనుమతి లేకుండ జాయింటు ఫర్మ్ వ్యాపార లెక్కలు మరియు మిల్లుకు సంబంధించి అన్ని వ్యవహారములు చూస్తూ మోసము చేసి సుమారు **రూ.6.00 కోట్లు** కాజేసి తన స్వంత **HDFC బ్యాంకు అకౌంటుకు జమ చేసుకొన్నాడు.** మరియు జాయింటు ఫర్మ్ ఆస్తులు ఐటం నెం.1 నుంచి 3లో 50% వాటా తనకు బదలాయిస్తూ **శ్రీమతి పచ్చిపాల శైలజ** తన పేరుతో వీలునామా వ్రాసినట్లు సృష్టించినాడు. పై వ్యవహారములు **నా మొదటి క్లయింటు సుధాకర్** మరియు వారి కుమార్తె నా 2వ క్లయింటు అయిన **చేతల గీత** అనుమతి లేకనే జరిగినవి. మరియు సదరు వ్యవహారములు నా క్లయింట్లను బద్ధకించజాలవు. నా మొదటి క్లయింటు **సుధాకర్‌కు** మొత్తము ఆస్తిపై హక్కు వున్నందున **పచ్చిపాల శ్రీనివాసులుకు** మరియు అతనికి సంబంధించి అకౌంటు వున్న HDFC బ్యాంకు వారికి భాగస్వామ్య వ్యాపారము రద్దు కాబడినదని నోటీసు తే.25-07-2025 మూలముగా తెలియజేయబడినది. నా క్లయింట్ కుమారుడైన **శ్రీనివాసులు** ఇప్పుడు కూడా అనుమతి లేకుండా రైస్‌మిల్లు నడుపుచూ అన్ని వ్యవహారములు చేయుచున్నారు. కావున **పచ్చిపాల శ్రీనివాసులు** క్రింది షెడ్యూలు ఆస్తులు ఐటం 1 నుంచి 3కి సంబంధించి ఎటువంటి లావాదేవీలు, లీజులు మరియు మోర్టిగేజు, అప్పులు మరియు ఆస్తులు ఇతరుల పేర్ల మీద బదలాయింపు చేసిన చెల్లనేరవు. మరియు నా క్లయింట్లకు బద్ధగింపజాలవు.

ఆస్తి షెడ్యూలు

అయిటం నెం.1: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు రి.డి. యిలాకా స్టోన్‌హౌస్‌పేట స.రి.లో చేరిన, నెల్లూరు మున్సిపాలిటీలో చేరిన, నెల్లూరు టవున్ శెట్టిగుంట రోడ్డులో వార్డు నెం.3రులో **35 అంకణములా 8 చదరపు అడుగులు లేక 234.850 చ.మీ. స్థలమున్నూ** యీ స్థలములో నిర్మించియున్న అసెస్‌మెంట్ నెం.1031003834రు డోరు నెం.3/1162/ఎ రు గల ఆర్.సి.సి.మిద్దె ఇల్లు స్థలం వగైరాలకు **హద్దులు: తూర్పు:** బచ్చల మల్లికార్జున ప్రహరీగోడ, **దక్షిణం:** పావులూరి సేతాజి గారి యింటి స్థలం, యీ దిశ కొలత 79 అడుగులు, **పడమర:** రాజా వీధి, యీ దిశ కొలత 32 అడుగులు, **ఉత్తరం:** బచ్చల వెంకటేశ్వర్లు గారి స్థలము, యీ దిశ కొలత 79 అడుగులు. యీ హద్దులలోని 35 అంకణములా 8 చదరపు అడుగులు లేక 280.88 చ.గ.లు స్థలమున్నూ, సదరు స్థలములో నిర్మించియున్న గ్రౌండ్ ఫ్లోర్‌లోని 25 అంకణములు లేక 1800 చ.అ.లు ఆర్.సి.సి.మిద్దె యిల్లున్నూ, ఫస్ట్ ఫ్లోర్‌లోని 25 అంకణములు లేక 1800 చ.అ.లు ఆర్.సి.సి. మిద్దె ఇల్లున్నూ, సెకండ్ ఫ్లోర్‌లోని 25 అంకణములు లేక 1800 చ.అ.లున్నూ, యీ యింటికి అమర్చిన తలుపులు, ద్వారబంధనములు, అలమరలు, కిటికీలు, అడుగుస్థలం, పై కప్పు సామాన్లు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్స్ వగైరా యిందుకు సంబంధించిన యావత్తు ఈజ్‌మెంటు హక్కులలో సమిష్టిన నాకు హక్కు గల 1/2 భాగమున్నూ.

అయిటం నెం.2: శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు రి.డి. యిలాకా, స్టోన్‌హౌస్‌పేట స.రి.లో చేరిన, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరిన నెల్లూరు బిట్-2 యేరియాలోని, సి.ఎ.యస్.నెం.130/1రు, నెల్లూరు నగరం, మీవర్స్ కాలనీ అను ప్రదేశము నందు వార్డు నెం.3రు, పాత డోరు నెం.1040రు, క్రొత్త డోరు నెం.1079/బి రు గల" **శ్రీ తిరుమల వెంకటరమణ రైస్ మిల్"కు** సంబంధించిన కట్టుబడి స్థలము వగైరాలకు **హద్దులు: తూర్పు:** రోడ్డు, **దక్షిణం:** యీ రైస్ మిల్లు తాలూకు స్వంత ప్రహరీగోడను అనుకొని వేమూరు ఆదెయ్య గారి ఇల్లు, **పడమర:** గోపీ సా మిల్‌ను అనుకొని యీ రైస్ మిల్లు గూడౌన్ తాలూకు గోడ, **ఉత్తరం:** మెకానిక్ కొండయ్య గారి ఇంటిని అనుకొని యీ రైసు మిల్లు తాలూకు గోడ. యీ హద్దులలోని 225 అంకణములు లేక 1505.025 చ.మీ.లు స్థలమున్నూ, సదరు స్థలములో 2417 చదరపు అడుగులు లేక 224.546 చ.మీ.లు యమ్.టి.సి.కట్టుబడిన్నీ మరియు 8179 చ.అ.లు లేక 759.851 చ.మీ.లున్నూ యీ రైస్ మిల్లుకు సంబంధించిన మిషనరీ అనగా షెల్లార్, కోన్స్, ఎలక్ట్రిక్ మోటార్లు-6, మరియు సపరేటర్ వగైరా యీ రైస్‌మిల్లుకు సంబంధించిన యావత్తు యీజ్‌మెంటు హక్కులలో సమిష్టిన నాకు హక్కు గల 1/2 భాగమున్నూ.

అయిటం నెం.3: శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు రి.డి.యిలాకా, కోవూరు స.రి.లో చేరిన, కోవూరు మండలం, **పడుగుపాడు గ్రామ పంచాయితీ, పడుగుపాడు గ్రామంలోని సర్వే నెం.375/3 య.3-00ట్లు లేక 1.215 హెక్టార్లు లేక 14520 చదరపు గజములు స్థలమున్నూ** యీ స్థలములో నిర్మించియున్న **"శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి రా & బాయిల్డ్ రైస్‌మిల్ బిల్డింగు వగైరాలకు హద్దులు: తూర్పు:** రాజా యదునందన కుమార్, రాజా లక్ష్మీదేవి, రాజా వెంకట చిరంజీవి మరియు రాజా సనత్‌కుమార్ గార్ల భూమి, **దక్షిణం:** జమ్మిపాలెం రోడ్డు, పడమర: నాగాసూరి రామమూర్తి, దేసు విజయకుమార్, నాగసూరి వసంత కుమారి, దేసు శ్రీ కల్పన గార్ల భూమి, **ఉత్తరం:** కాలువ. యీ హద్దులలోని య.3-00ట్లు లేక 1215 హెక్టార్లు లేక 14520 చదరపు గజములు స్థలమున్నూ, సదరు స్థలములో నిర్మించియున్న 10 అడుగులు పైన ఎత్తు గల 13891.5 చదరపు అడుగులు ఏసిసి. రేకుల కప్పు గల మిల్ తాలూకు హాలున్నూ 7788.84 చదరపు అడుగులు గల ఏ.సి.సి. కప్పు గల గూడౌను 1032.39 చదరపు అడుగులు ఆర్.సి.సి. కప్పు గల ఆఫీసు రూము మరియు వరండాన్నూ 588 చదరపు అడుగులు ఆర్.సి.సి.కప్పు గల సిల్క్ హస్క్ రూమున్నూ 404.25 చదరపు అడుగుల ఏ.సి.సి. కప్పు గల పవర్ రూమున్నూ 685.76 చదరపు అడుగుల ఏ.సి.సి. కప్పు గల వర్కర్స్ క్వార్టర్స్‌న్నూ యీ కట్టుబడికి అమర్చిన తలుపులు, ద్వారబంధనములు, అలమరలు, కిటికీలు, పట్టర్లు, ఎలక్ట్రికల్ ఫిట్టింగ్సు, యీ రైస్‌మిల్‌కు సంబంధించిన మిషనరీ వగైరా యీ మిల్లుకి సంబంధించిన యావత్తు యీజ్‌మెంట్ హక్కులలో సమిష్టిన నాకు హక్కు గల 1/2 భాగమున్నూ.

వేనాటి చంద్రశేఖరరెడ్డి., బి.ఎ., బి.యల్.,
అడ్వకేట్, రమేష్‌రెడ్డినగర్, నెల్లూరు-3. సెల్: 98490 02833

ఇరువర్గాల ఘర్షణపై కేసు నమోదు

లింగసముద్రం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అంగట్లో తీసుకున్న సరుకులకు సంబంధించిన బాకీ చెల్లించాలని అడిగినందుకు ఇరువర్గాల మధ్య జరిగి ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.నారాయణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. మొగిలిచెర్ల బస్టాండ్ సెంటర్‌లో గోపిశెట్టి వెంకటరత్నం చిల్లర అంగడి నిర్వహిస్తున్నాడు. ఈనెల 14వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో గ్రామానికి చెందిన మన్నం శ్రీకాంత్ మద్యం తాగి దుకాణం వద్దకు వచ్చి సిగరెట్ ఇవ్వాలని కోరాడు. అయితే అప్పటికే ఆయన బాకీపడిన రూ.1000 ఇవ్వకుండా మళ్లీ అప్పుగా సిగరెట్ ఇవ్వడం కుదరదని వెంకటరత్నం చెప్పారు. దీంతో శ్రీకాంత్ నేను ఇవ్వాల్సింది రూ.500లేనని, దొంగ లెక్కలు రాస్తున్నావని వాగ్వివాదానికి దిగాడు. దీంతో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. అయితే అక్కడున్న కొందరు ఇద్దరికి సర్దిచెప్పి పంపించారు. ఈ క్రమంలో ఈనెల 15వ తేదీ ఉదయం వెంకటరత్నం, ఆయన బంధువు గోపిశెట్టి రామలింగయ్య మరికొందరు బంధువులు శ్రీకాంత్ వద్దకు వచ్చి రాత్రి ఎందుకు గొడవకు దిగావని నిలదీశారు. దీంతో వెంకటరత్నం బంధువులకు, శ్రీకాంత్‌కు ఆయన భార్య సంధ్యకు తీవ్ర వాగ్వివాదం జరిగి ఘర్షణ పడి కొట్టుకున్నారు. ఈ క్రమంలో శ్రీకాంత్, సంధ్యలు తమను కొట్టారని రామలింగయ్య పోలీసులకు పిర్యాదు చేశారు. అయితే సంధ్య కందుకూరు ఏరియా వైద్యశాలలో చికిత్స కోసం చేరి తనను, తన భర్త శ్రీకాంత్‌ను వెంకటరత్నం, రామలింగయ్య మరో ముగ్గురు కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయని, అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి వచ్చిన ఫిర్యాదుతో పాటు రామలింగయ్య ఇచ్చిన ఫిర్యాదుపై శనివారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

బద్దిపూడిలో వైద్యశిబిరం

ఉలవపాడు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : బద్దిపూడిలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి వైద్యులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు సుధీర్‌కుమార్, సయ్యద్ ముస్తాక్ తెలిపారు. టీడీపీ నాయకుడు కూనం బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు జాషువ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 30 మందికి ఆపరేషన్, 28 మందికి అద్దాలు అవసరమని గుర్తించారు.

'కిల్కారి' సేవల్లో 9వ స్థానం

- మొబైల్ యాప్ వల్ల ఎన్నో ఉపయోగాలు
- ఆశాలతో గర్భిణుల సమాచారం నమోదు
- ఇతర వైద్య సేవలపై వాయిస్ మెసేజ్
- అమలుపై అధికారుల నిర్లక్ష్యం
- తాజాగా ప్రభుత్వం వివరాల వెల్లడి

నెల్లూరు (వైద్యం) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): గతంలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన కిల్కారి యాప్ మొబైల్ వైద్యసేవల్లో ప్రస్తుతం జిల్లా 9వ స్థానంలోకి దిగజారింది. కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చిన కిల్కారి మొబైల్ యాప్ ద్వారా గర్భిణులు, ఇతర వ్యాధులు, వ్యాధి నిరోధక టీకాలు అమలు వివరాలను ఈ యాప్‌లో ఆశా వలంటీర్లు నమోదు చేస్తారు. తద్వారా వైద్య సేవలు మరింత విస్తృత పరిచే అవకాశం ఉంది. 2016 ఆగస్టు 15న కిల్కారి యాప్ మొబైల్ సేవలు అందుబాటులోకి రాగా, ప్రస్తుతం గుంటూరు మొదటి స్థానంలోనూ కర్నూలు రెండో స్థానంలోనూ ఉంది. అయితే జిల్లా 9వ స్థానానికి చేరుకోవడం అధికారులు వైఖరిని తేటతెల్లం చేసింది. తాజాగా ప్రభుత్వ వెల్లడించిన నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. ప్రస్తుతం కిల్కారి మొబైల్ అకాడమీ సేవలపై మరిన్ని వైద్యసేవలపై ఆశా నోడల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు.



● యాప్ సేవలు ఇలా..

మహిళలు మూడోనెల గర్భం దాల్చినప్పటి నుంచి ఎలాంటి వైద్య చికిత్సలు చేయించుకోవాలి... ఎప్పుడప్పుడు ఆసుపత్రులకు వెళ్లాలి... అలాగే నవజాతా శిశువులకు వ్యాధినిరోధక టీకాలు ఎప్పుడు వేయించాలి...? తదతర హెచ్చరికలు వాయిస్ మెసేజ్ ద్వారా తెలియ చేసే యాపే కిల్కారీ యాప్. ఈ యాప్‌ను కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఈ యాప్ బాధ్యతను ఆశా కార్యకర్తలకు అప్పగించారు. ఇప్పటికే ఆశాలకు వైద్యాధికారులు శిక్షణ కూడా ఇచ్చారు. వీరు నగర, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న గర్భిణులను గుర్తించి, ఈ కిల్కారి యాప్‌ను వారి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించాల్సి ఉంది. గర్భిణులకు, చిన్నారులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా దీన్ని రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు, 10 సీహెచ్‌సీల, నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆత్మకూరు జిల్లా ఆసుపత్రితో పాటు కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు ఉన్నాయి. ప్రతి ఏటా జిల్లా వ్యాప్తంగా 45 వేల ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గర్భిణులకు అవసరమైన వైద్య సేవలు ఎప్పుటికప్పుడు ఈ యాప్‌ద్వారా తెలియ చేస్తారు.



గర్భిణీల వివరాలు నమోదు చేస్తున్న ఆశా వర్కర్లు

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉండేలా చర్యలు



ఈ పథకం అమలుపై క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ కిల్కారీ యాప్ వల్ల ఎంతో ఉపయోగం ఉంది. గర్భిణులు, చిన్నారులు ఎలాంటి వైద్య సేవలు పొందాలి...ఎప్పుడప్పుడు వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలి... వంటి విషయాలను ఈ యాప్ వాయిస్ మెసేజ్ ద్వారా తెలియచేస్తుంది. తద్వారా గర్భిణులు, చిన్నారులు వెంటనే వైద్య సేవలు పొందే అవకాశం ఉంది. ఆశా కార్యకర్తలు గర్భిణులను గుర్తించి వారి సెల్‌ఫోన్‌లో కిల్కారి యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి సకాలంలో వైద్య చికిత్సలు పొందేలా కృషి చేస్తున్నాం.

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

● సందేశాలు ఇలా..

గర్భం, జననం, చిన్నారుల సంరక్షణ గురించి సమయనికి తగిన విధంగా 72 ఆడియా సందేశాలు వినిపించనున్నాయి. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే 012445880 నుంచి కాల్ వచ్చినప్పుడు ఏదైనా పనిలో ఉండి పూర్తిగా వైద్య చికిత్సల సందేశం వినలేకపోతే... 14423కి కాల్ చేసి మిగిలిన సమాచారం తెలుసుకోవచ్చు. తద్వారా ఆయా వైద్య సేవలు పొందవచ్చు. ఈ పద్ధతి ద్వారా గర్భిణుల, శిశువు ఆరోగ్యంపై అవగాహన పొందవచ్చు. నేను డాక్టర్‌ను.. అన్నయ్య, వదినమ్మా, చెల్లెమ్మ ఎలా ఉన్నారు.. మీ ఆరోగ్యం ఎలా ఉంది... పాపాయి ఎలా ఉంది.. అంటూ సందేశం మొదలు పెట్టి ఆరోగ్య సేవల గురించి ఎప్పుడప్పుడు వైద్య చికిత్సలు చేయిం చుకోవాలి వంటి విషయాలను తెలియ చేస్తుంది.



గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిన జేసీ కార్తీక్

గౌతు లచ్చన్న జీవితం నేటితరానికి ఆచరణీయం

● జేసీ కార్తీక్

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్వాతంత్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం నేటి తరానికి ఆచరణీయమని జేసీ కే. కార్తీక్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో శనివారం గౌతు లచ్చన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం లచ్చన్న ఎంతగానే పోరాడన్నారు. హరిజనుల కోసం రాత్రి పాఠశాలలు ప్రారంభించి, బలహీన వర్గాలవారి కోసం చురుకుగా పనిచేశారని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ, టూరిజం అధికారి ఉషశ్రీ, మత్స్యశాఖ జేడీ శాంతి, బీసీ నాయకులు జనార్దన్‌గౌడ్, ఉప్పు భాస్కర్, పద్మజాయాదవ్, శ్రీనివాసులు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ఈవోకు చెక్కు అందజేస్తున్న విజయకిషోర్‌రెడ్డి దంపతులు



పెంచలోరి నిత్యాన్నదాన పథకానికి రూ. లక్షా 50వేల విరాళం

రాపూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలోని నిత్యా న్నదాన పథకానికి కడప వాస్తవ్యులు డాక్టర్ విజయ్‌కిషోర్‌రెడ్డి దంప తులు రూ.1,50,000 చెక్ రూపంలో ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డికి శనివారం అందజేశారు. అనంతరం దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక దర్శనం చేయించి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా ఏపీజీఈఏ గుర్తింపు దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుర్తింపు దినోత్సవాన్ని నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ సంఘానికి గుర్తింపు వచ్చి ఆరేళ్లు పూర్తయ్యాయని తెలిపారు. ఆనాటి నుంచి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం ఎంతగానో పాటు పడుతోం దని చెప్పారు. ప్రస్తుతం 'టీ తాగుతూ మాట్లాడుకుందాం'.. కార్య క్రమం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు తెలుసుకుని రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మహిళా విభాగం చైర్‌పర్సన్ సుజాతాబాయి, కార్యదర్శి రాంప్రసాద్, కోశాధికారి రాఘవ విశ్వనాథం, ఏనుగ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

స్త్రీశక్తి.. సంబరం

ఆర్టీసీలో ఉచిత ప్రయాణంపై అతివల ఆనందం

గతంలో ఏ ప్రభుత్వమూ ప్రవేశపెట్టని ఓ కొత్త పథకాన్ని ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించడంతో జిల్లాలో ఎక్కడ చూసి నా 'స్త్రీశక్తి' పథకం గురించే చర్చ నడిచింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్న మహిళలు ఓ కొత్త లోకంలో ఉన్నట్లు భావిస్తున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తున్న సేపూ కుటుంబసభ్యులకు, స్నేహితులకు, బంధువులకు ఫోన్లు చేసి 'నేను ఉచితంగా బస్సులో ప్రయాణిస్తున్నా' చెప్పుకుని మురిసి పోతున్నారు. 'జీరో ఫేర్' టికెట్లతో సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసుకున్నారు. స్త్రీశక్తి ప్రారంభమైన శని, ఆదివారాలు సెలవులు కావడంతో బస్సుల్లో పెద్దగా ప్రజలు ప్రయాణించకపోయినా ఈ సీజన్‌లో ఆర్టీసీకి 11 శాతం ఓఆర్ పెరిగిందని అధికారులు తెలిపారు.

- నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

ఆనందంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి కల్పించడం ఆనందంగా ఉంది. అరకొర వేతనాలతో ఇతర ప్రాంతాల్లో పనిచేసే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఇతరత్రా పనులుచేసే మహిళలకు చార్జీలకే వచ్చిన డబ్బు సరిపోతోంది. ఉచిత ప్రయాణంతో అలాంటి వారికి ఆర్థికభారం తప్పింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి ఉంటారు.

- అల్లూరి జ్యోతి, ఉదయగిరి

ఇక పాసుల కష్టాలుండవ్!



పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థినులు నెల పాసుల కోసం ఆర్టీసీ బస్టాండ్ల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా పోయింది. ఉచిత బస్ ప్రయాణం పేద, మధ్య తరగతి మహిళలకు, చదువుకునే విద్యార్థినులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు మహిళలు రుణపడి ఉంటారు.

- అనుపు మమత, చోడవరం, జలదంకి మండలం

మాలాంటి వారికి వరం



ఉచిత బస్సు ప్రయాణం మాలాంటి పేద మహిళలకు వరం. వారానికి రెండు, మూడు సార్లు నిత్యావసర వస్తువుల కొనుగోలు, ఇతరత్రా పనుల కోసం ఉదయగిరికి రావాల్సి ఉంటుంది. చార్జీలు ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడేవాళ్లం. ఇప్పుడు అలాంటిదేమీ ఉండదు. సంతోసంగా వచ్చి వెళతాం.

- షేక్ రహమతున్నీసా, వెంకటంపేట, దుత్తలూరు

ఎంతో ప్రయోజనం



మాది బుచ్చిరెడ్డిపాళెం. ప్రతిరోజు ఉదయం నెల్లూరు వెళ్లి మల్లెపూలు (విడిపూలు) కొనుగోలు చేసి తెచ్చుకుని కట్టి, మధ్యాహ్నం నుంచి సంగం వెళ్లి ఇంటింటికి తిరిగి విక్రయిస్తా. ప్రతి రోజు రానుపోను చార్జీలకే రూ.150 ఖర్చు అయ్యేది. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో నాకు అదంతా మిగిలుతుంది. ఈ డబ్బులు ఇంటి కూరగాయల ఖర్చుకు సరిపోతుంది. మాలాంటి పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం.

- కామాక్షి, పూల వ్యాపారి, సంగం

అవసరమైతేనే ప్రయాణించాలి



సీఎం చంద్రబాబు ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం ఆనందంగా ఉంది. పనిమీద నెల్లూరుకు వచ్చా. మళ్లీ తిరిగి వెళుతున్నా. ఉచితమని అవసరం లేకుండా ప్రయాణం చేయకూడదు. అవసరమైతేనే ప్రయాణం చేయాలి.

- తులసమ్మ, ముసునూరువారి పాళెం

చాలా ఆనందంగా ఉంది



మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందించడం చాలా ఆనందంగా ఉంది. ప్రధానంగా పల్లె ప్రాంతాల్లో మహిళలు ఎంతో లబ్ధి పొందుతారు. మా బంధువుల్లో ఎంతో మంది పల్లెల నుంచి నగరానికి వచ్చి కూరగాయలు, సామాన్ల కోసం వచ్చి వెళుతుంటారు. వీరందరికీ ఎంతో ఉపశమనంగా ఉంటుంది. నేను కూడా ప్రతి వారం మా అమ్మవాళ్ల ఇంటికి ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేస్తాను.

- మల్లేశ్వరి, నెల్లూరు

చార్జీలేని ప్రయాణం భలే ఉంది!



ఆర్టీసీలో చార్జీలేని ప్రయాణం ఎంతో సంతోషంగా వుంది. యలమంచిపాడు నుంచి బుచ్చికి ఆటోలో వచ్చాను. బుచ్చినుంచి నెల్లూరుకు ఆర్టీసీ బస్సులో వెళ్తున్నాను. ఆధార్ కార్డువుంటే చాలు బుచ్చినుంచి నెల్లూరుకు రానుపోను రూ.60 మిగులుతోంది. దీంతో ఇద్దరు పిల్లలు, భార్య, భర్త ఉన్న కుటుంబాలకు ఖర్చు కలిసిసొస్తుంది.

- శ్రావణి, యలమంచిపాడు, దగదర్తి మండలం

ఎంతో మంచిపని చేశారు



ముఖ్యంత్రి చంద్రబాబు ఆడోళ్లకు ఎంతో మంచిపని చేశారు. ఆర్టీసీ బస్సుల్లో డబ్బులు లేకుండా ఉచితంగా తీసుకెళతారంటే నమ్మలేక పోతున్నాను. ఇంతకముందు దూరంగా ఉండే బంధువుల ఇళ్లలో జరిగే పెళ్లిళ్లకు, ఇతర కార్యాలకు పోవాలన్నా చార్జీలకే చాలా డబ్బులు ఖర్చు అయ్యేవి. అయితే ఇప్పుడు ఉచితంగా వెళ్లొచ్చు. ఈ చార్జీల డబ్బులు ఇంట్లో ఇతర అవసరాల కోసం వాడుకోవచ్చు.

- ఉన్నం నాగమణి, లింగసముద్రం

చాలా ఆనందంగా ఉంది



నెల్లూరుకి పనిమీద వచ్చా ను. బస్సులో ఉచితంగా ఎక్కించుకున్నారు. సీఎం చంద్రబాబు ప్రకటించినట్లు ఉచిత బస్సు ప్రయాణం తమకు ఆర్థికభారం లేకుండా చేసింది. నెల్లూరుకు చార్జీ పెట్టుకుని రావాలంటే కొంత కష్టంగా ఉండేది. ఉచిత ప్రయాణం వల్ల కొంత ఖర్చు తగ్గింది. అవసరమైనప్పుడు నెల్లూరుకి వచ్చే అవకాశం కూడా ఉంది.

- శ్రీదేవి, నేలటూరు

పుణ్యక్షేత్రాలకు వెళతా



మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. వయసు పెరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు కుటుంబ బాధ్యతలు తగ్గించుకుని దైవదర్శనానికి వెళ్లడం సర్వసాధారణం. అలా గ్రూపులుగా వెళ్లే మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత బస్ ప్రయాణం ఒక వరం లాంటిది. ప్రతి శనివారం కావలి నుంచి లింగసముద్రం, మొగిలిచర్ల ఆలయాలకు వెళ్తంటాము. ఉచిత బస్ పథకం మహిళల్లో ఉత్సాహాన్ని నింపుతుంది.

- దాచేపల్లి రత్నమ్మ, వైకుంఠపురం, కావలి

గౌరవం పెరిగింది!

ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గౌరవంగా భావిస్తున్నా. ఈరోజు మా బంధువుల శుభ కార్యక్రమానికి సంగం నుంచి పొదలకూరు వెళ్లి అక్కడి నుంచి కలువాయి వెళ్లి తిరిగి వచ్చా. రానుపోను సుమారు రూ.160 మిగిలింది.

- ఆదిమూలకు విజయలక్ష్మి, గృహిణి



చార్జీ లేకుండా మా ఊరెళతా!



మా అమ్మవాళ్ల ఊరు చీరాల. ఊరు వెళ్లాలని ఇంట్లో కోరితే అక్కడికి వెళ్లాలంటే చార్జీలు ఎంత అవుతాయో తెలుసా అని ప్రశ్నిస్తారు. ఇకపై నేను రెండు బస్సులు మారైనా చార్జీ లేకుండా మా ఊరికి ఉచితంగా వెళతాను. ఉచిత ప్రయాణం వల్ల ఎంతో మంది మహిళలు లబ్ధి పొందుతారు.

- ఎస్కే షమీరా, నెల్లూరు

చలో కరేడుకు అనుమతి లేదు

- 30 పోలీసు యాక్టు అమలులో ఉంది
- బయటి వ్యక్తులను గ్రామంలోకి రానివ్వం
- కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని ఉలవపాడు మండలం కరేడులో ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం జరుగుతున్న భూసేకరణను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ కమిటీ ఈనెల 18న తలపెట్టిన చలో కరేడు కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేవని కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక పోలీసు సబ్‌డివిజన్ కార్యాలయంలో ఆయన సీఐ అన్వర్‌బాషా, ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరేడుకు 30 పోలీసు యాక్టు అమలులో ఉండటమే గాక రెవెన్యూ అధికారులు 144 సెక్షన్ కూడా అమలు చేస్తున్నారని, దీంతో బయటి వ్యక్తులను కరేడుకు అనుమతించేది లేదన్నారు. చలో కరేడు కార్యక్రమం గురించి మీడియాలో చూస్తున్నామని, అయితే రైతు సంఘాల నేతలెవరూ పోలీసుల అనుమతి తీసుకోవటం కానీ కనీసం సమాచారం ఇవ్వటం కానీ చేయలేదని తెలిపారు. కరేడులో బయటి వ్యక్తులు వచ్చి అపోహలు సృష్టిస్తున్న పరిస్థితుల్లో ఎలాంటి ఆందోళనలకు అనుమతి ఇవ్వటోమన్నారు. కరేడుకు బయటి వ్యక్తులు వచ్చి అనవసరంగా మాలో భయాందోళనలు రేకెత్తిస్తున్నారని, అటువంటి వారు రాకుండా చర్యలు తీసుకోవాలని కరేడు గ్రామస్థులు కూడా కొందరు ఉలవపాడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భూసేకరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో పాల్గొన్నవారు, జాతీయ రహదారిని దిగ్బంధనం చేసిన వారిపై ఇప్పటికే క్రిమినల్ కేసులు నమోదు చేయడమే గాక స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి ముందుకొచ్చిన వారిపై భూములు ఇవ్వటం ఇష్టం లేనివారు దాడి చేసిన ఘటనపై కూడా కేసు నమోదు చేసి ఉన్నామని తెలిపారు. ఈ పరిస్థితుల్లో 18న కరేడుకు సంబంధం లేని వ్యక్తులు ఎవరైనా గ్రామంలోకి వచ్చి అక్కడి రైతులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ఇతరత్రా చర్యలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, పక్కన సీఐ అన్వర్‌బాషా, ఉలవపాడు ఎస్‌ఐ అంకమ్మ



దృష్టి దోషానికి చీరలతో రక్ష...

మనుబోలు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అక్కడ తోటలు సాగుచేసేది అంతా నిరుపేదలే. ప్రభుత్వం ఇచ్చిన అరకొర భూమిలో వంగతోటలు పండిస్తుం టారు. తోటలకు దృష్టి దోషం (దిష్టి) తగలకుండా, రాత్రి వేళలో పందులు ధ్వంసం చేయకుండా ఇదిగో.. ఇలా పాత చీరలతో కంచెలు ఏర్పాటు చేసి పంటలను రక్షించుకుంటున్నారు. మండలంలోని ముద్ద మూడి గ్రామంలో పలు కుటుంబాలు వంగ తోటలు సాగు చేస్తూ తోట లకు రక్షణగా చీర లనే కంచెలుగా ఏర్పాటు చేసుకున్నారు.

నేడు ఉపకార వేతన మంజూరు పత్రాల పంపిణీ

దుత్తలూరు (ఉదయగిరి), ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీడ్స్ స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు ఆదివారం మంజూరు పత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందని సీడ్స్ సంస్థ ప్రతినిధి రసూల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీడ్స్ స్వచ్ఛంద సంస్థ, యువ ఆన్‌స్టాపబుల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ ఉపకార వేతనాల పంపిణీకి సంబంధించి 2025-26 విద్యా సంవత్సరానికి 97 మంది విద్యార్థులకు రూ.1,74,50,000ల కోట్ల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 9553
వెండి కిలో ధర	రూ. 117500
వెండి ఒక గ్రాము	రూ. 120.50



విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం

● కొండ్రెడ్డి రమణారెడ్డి, ఏఎస్‌డబ్ల్యూవో

ఉదయగిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమమే లక్ష్యం అని అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కొండ్రెడ్డి రమణారెడ్డి తెలిపారు. ఎస్సీ విద్యార్థులు ప్రభుత్వ వసతిగృహాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

? నియోజకవర్గంలో ఎన్ని ఎస్సీ వసతిగృహాలు ఉన్నాయి.

! నియోజకవర్గంలోని 7 మండలాల్లో 8 ఎస్సీ వసతిగృహాలు ఉన్నాయి. అన్నింటికి సొంత భవనాలే.

? ఏడు వసతిగృహాల్లో ఎన్ని సీట్లు ఉన్నాయి.

! మొత్తం సీట్లు 800 కాగా 565 సీట్లు భర్తీ అయ్యాయి.

? వసతిగృహాల్లో పౌష్టికాహారం అందిస్తున్నారా.

! ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. ఉదయం పాలు, టిఫిన్, వారానికి మూడు రోజులు చికెన్, శనివారం తప్ప ప్రతిరోజు కోడిగుడ్డు, సాయంత్రం స్నాక్స్ అందచేస్తున్నాం.

అమ్మకానికి గణనాథులు సిద్ధం



అమ్మకానికి సిద్ధంగా ఉన్న వినాయక విగ్రహాలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27వ తేదీన జరుగనున్న వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ ఆకరాల్లో ఉన్న గణనాథుని విగ్రహాలను పట్టణాల్లో వ్యాపారులు అమ్మకానికి సిద్ధం చేశారు. గ్రామాల్లో పోటీలు పడి ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తుగానే అడ్వాన్సు చెల్లిస్తే కొంతమేర ధర తగ్గుతుందనే ఆశతో తమకు నచ్చిన విగ్రహాలకు నగదు చెల్లించేందుకు పరుగులు తీస్తుండడంతో సందడి వాతావరణం చోటుచేసుకుంది. కాగా, ఉదయగిరి పట్టణంలోని ట్యాంకుబండ్‌కు ఇరువైపులా వివిధ రూపాలలో రంగురంగుల వినాయక విగ్రహాలను అమ్మకానికి ఉంచడంతో అటుగా వాహనాల్లో వెళ్లే ప్రయాణికులతో పాటు కాలినడకన వెళ్లే ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు.



ఆత్మకూరు : యాదవవీధిలోని కృష్ణ మందిరంలో శ్రీకృష్ణుడి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



సంగం తూర్పువీధిలో ఉన్న కృష్ణ మందిరంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న అర్చకులు



దుత్తలూరు సెంటర్‌లో శ్రీకృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వాడవాడలా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

● భక్తులతో కిటకిటలాడిన కృష్ణ మందిరాలు ● కనుల పండువగా వేణుగోపాలుడి కల్యాణం ● ఉత్సాహంగా ఉట్టి మహోత్సవాలు

ఆత్మకూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుల కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో యాదవ వీధిలోని కృష్ణమందిరం, టెంకాయతోపులోని రాధాకృష్ణుల మందిరంలో కల్యాణ మహోత్సవాలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. యాదవ వీధిలోని కృష్ణమందిరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కళ్యాణ మహోత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు, యాదవులు పాల్గొన్నారు. టెంకాయతోపులో రాధాకృష్ణుల వివాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే మండలంలోని చెర్లోయడవల్లి, బట్టేపాడు, తదితర గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

● సంగం : స్థానిక తూర్పువీధిలో ఉన్న కృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం శ్రీకృష్ణుని కీర్తనలు ఆలపించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం నిర్వహించారు.



సీతారామపురం : గ్రామోత్సవంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చెంచలబాబు యాదవ్ తదితరులు

● ఉదయగిరి : మండలంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గండిపాళెం గ్రామంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటుచేసి భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే నేలటూరు, సున్నంవారి చింతల, ఉదయగిరి, జీ.చెర్లోపల్లి, గుడినరవ, ఆర్లపడియ తదితర గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేపట్టారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం అందజేసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలువురు తమ చిన్నారులకు గోపిక, శ్రీకృష్ణుని వేషధారణలు వేయించారు.

● దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంతము వారి ఆధ్వర్యంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక మండపంలో శ్రీకృష్ణుని విగ్రహం ఏర్పాటుచేసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. భగవద్గీత పఠనం చేపట్టారు.

● వింజమూరు : పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న కృష్ణమందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం భక్తులు కోలాటం భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో బైనబోయిన వెంకటేశ్వర్లుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

● ఏఎస్ పేట: శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక శ్రీకృష్ణ మందిరంలో రుక్మిణి శ్రీకృష్ణుల కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. మందిరంలోని రుక్మిణి శ్రీకృష్ణులను పూలతో అలంకరించి, పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఘనంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

● సీతారామపురం: మండల కేంద్రంలోని కురవ వీధిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మాజీ జడ్పీ చైర్మన్ పొన్నెబోయిన చంచలబాబు యాదవ్, మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు శ్రీకృష్ణుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానంతో పాటు, ఉట్టి మహోత్సవం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాల ప్రజలు గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గండిపాళెంలో కృష్ణుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఏఎస్‌పేటలో ప్రత్యేక అలంకారంలో రుక్మిణి సమేత శ్రీకృష్ణుడు



వింజమూరులో శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలకు అవగాహన



బస్సులో ప్రయాణికులతో మాట్లాడుతున్న టీడీపీ, జనసేన నాయకులు

అనంతసాగరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీశక్తి పథకం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంపై సోమశిలలో టీడీ పీ, జనసేన నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆధార్ కార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలని మహిళలకు సూచించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేస్తున్నట్లు గుర్తు చేస్తూ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకరావు, పార్థసారధి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



గోడపత్రికలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

సంగం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన విజయవాడలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం ఏపీ అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా శనివారం వారు స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీ 2003 ఫోరం ఏపీ జిల్లా కన్వీనర్ బత్తూరు మోహన్‌రావు, మండల అధ్యక్షుడు నల్లమారి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గాలి శివకుమార్, ఉపాధ్యాయులు బి వెంకటేశ్వరు, కిషోర్, జయప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం



ఎస్‌ఐ ఆలా శ్రీనును సన్మానిస్తున్న పోలీసులు

ఉదయగిరి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించి స్వాతంత్ర్య దినోత్సవం రోజున మంత్రి నారాయణ, ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న ఎస్‌ఐ ఆలా శ్రీనును శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి, పోలీసు సిబ్బంది సన్మానించారు. అలాగే టీడీపీ నాయకులు ఆయన్ను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, మట్ల నాగయ్య, పోలీస్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, గోవింద్, ప్రభాకర్, అశోక్, సల్మా, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి 'చలో కరేడు'ను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అనంతసాగరం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న నిర్వహించనున్న చలో కరేడు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల అధ్యక్షుడు అన్వర్‌బాష కోరారు. శనివారం అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బలవంతపు భూసేకరణ ఆపాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బరాయుడు, గాడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్‌పై ఆగని ప్రజాపోరు

● కోర్టును ఆశ్రయించిన ఆందోళనకారులు



జాతీయ రహదారిపై బైటాయించి చేస్తున్న ఆందోళన

ఉదయగిరి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని వరికుంటపాడు మండలంలోని వరికుంటపాడు, భాస్కరాపురం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్లు 233,1లోని 43 ఎకరాల కొండ పోరంబోకు భూముల్లో మైనింగ్ తవ్వకాలు సాగిస్తే కూతవేటు దూరంలోని జంగంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ వాసులతో పాటు సమీప వరికుంటపాడు, ఆండ్రావారిపల్లి, కనియంపాడు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవంటూ ఆందోళనకారులు చేస్తున్న పోరాటం కొనసాగుతూనే ఉంది. పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు రోజుల తరబడి తమదైన శైలిలో పోరాటాలు సాగిస్తుండడం విశేషం. అందులో భాగంగా అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకు అతీతంగా జేఏసీగా ఏర్పడి విడతల వారీ ఆందోళన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ప్రజాప్రతినిధులు, రాష్ట్ర స్థాయి అధికారులకు సైతం వినతిప్రతాలు అందజేసి న్యాయం చేయాలని వేడుకున్నారు.

కోర్టును ఆశ్రయించిన ఆందోళనకారులు

కాగా, ఆందోళన కార్యక్రమాలు చేపటకూడదనే ఉద్దేశంతో పోలీసులు ఆందోళనకారులపై నిఘా ఏర్పాటు చేసి ఆంక్షలు విధించారు. ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన వ్యక్తులతో పాటు విద్యార్థులు, యువకులకు హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. అయినప్పటికీ పట్టు వీడని ఆందోళనకారులు ఇటీవల హైకోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 20వ తేదీన తీర్పు వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, ఆరోజు ఎలాంటి తీర్పు వెలువడుతుందోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ANDHRA JYOTHY
THE ANDHRA JYOTHY WAY CLASSIFIEDS
Services Finance Education Health Real Estate Wanted
ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ ప్రతిరోజు

కర్ణాటక AC బస్సు యాత్ర
మైసూరు, శ్రీరంగ పట్నం, బేలూరు, శృంగేరి, కుక్కి సుబ్రహ్మణ్యం, గోకర్ణం, మరికొన్నిటిలో మా తదుపరి యాత్ర షిర్డి 7 రో. 1టి.రూ.14,400/-. తేది.24-08-2025. సం.ప్ర. బొబ్బల శేషయ్య, సెల్: 98665 27640
AJR-2890

పని మనిషి కావలెను
కావలిలో ఉంటున్న మా అమ్మ (72 సం.)కు వంట & ఇంటి పని చేసేందుకు ఒక మహిళా Care Taker కావలెను. జీతం & భోజన వసతి కల్పించబడును. స్థానికులకు ప్రాధాన్యత కలదు. సం.ప్ర.9550026403
AJR-240556

TOLET
నెల్లూరు టౌన్ హాలు ఎదురుగా ఆఫీసుకు, కోచింగ్ సెంటర్‌లకు బాడుగకు ఇవ్వబడును. సం.ప్ర. సెల్: 99853 12224, 94939 98347
AJR-212030

రైలు యాత్ర
కార్తీకమాసంలో మధ్యప్రదేశ్, గుజరాత్‌లోని 4 జ్యోతిర్లింగాలు, ద్వారకలు చూచుట తే.07-11-25. 12రో.1టి రూ.23,000/-. సం.ప్ర. బొబ్బల శేషయ్య, సెల్: 98665 27640
AJR-2905

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఒక్క రోజు జాలీ టూర్
షోలింగర్, తిరువల్లూరు, తిరుత్తణి, సురుటుపల్లి తేది:23-08-2025. 1 రోటి1కి 1600/- (A/c బస్సు, భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240617

కొల్హాపూర్ రైలు యాత్ర
కొల్హాపూర్, షిర్డి, ముంబై, 3 జ్యోతిర్లింగాలు, పండరీపురం తేది:24-10-25. 6 రో టి1కి 13000/- (రైలు, A/c రూం + A/c బస్సు భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240615

శ్రీధర్ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ
నెల్లూరు నగరంలో ప్లాట్లు ఇళ్లు ఇళ్లస్థలాలు అపార్ట్‌మెంట్లు మరియు కమర్షియల్ బిల్డింగ్స్ కమర్షియల్ స్థలాలు, డెవలప్మెంట్ సైట్లు మరియు పొలములు కావలసిన వారు అమ్మదలచిన వారు సంప్రదించండి. కమర్షియల్ బిల్డింగ్స్ రెంటుకి కావలిసిన వారు ఇవ్వదలచిన వారు మాతో సంప్రదించండి. హంస శ్రీధర్, సెల్: 98663 22989
AJR-212029

C.R.I.M.E N.E.W.S

భార్యతో చనువుగా ఉంటున్నాడని కిరాతకంగా యువకుడి హత్య

● ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు

నెల్లూరు (క్రైం) ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తన భార్యతో చనువుగా ఉంటూ తనను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని కక్ష పెంచుకొని, పక్కా ప్రణాళికతో నగరంలోని మూలాపేట అలంకార్ సెంటర్ సమీపంలో ఓ యువకుడిని దారుణంగా హత్య చేశారు. ఈ కేసులోని నిందితుల వివరాలను శనివారం చిన్న బజారు పోలీసుస్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మీడియాకు వెల్లడించారు. నగరంలోని సీఏఎం స్కూల్ ఎదురుగా కసాయివీధిలో షేక్ లైక్(35), రేష్మ దంపతులు కాపురం ఉంటున్నారు. వారికి రోషన్ జమీర్, రూమాన్ కుమారులు. లైక్ తన అన్న రఫీతో కలిసి క్యాటరింగ్ పనులు చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం లైక్ పాల ప్యాకెట్లు కోసం బైక్‌పై అలంకార్ సెంటర్‌కు వెళ్లాడు. పాల ప్యాకెట్లు తీసుకుని బయలుదేరుతుండగా ఇద్దరు వ్యక్తులు అడ్డుకొని కత్తులతో పొడవబోయారు. లైక్ బైక్‌ను వదిలేసి సమీపంలోని విక్టోరియా గార్డెన్ వీధిలోకి పరుగులు తీయడంతో నిందితులు వెంబడించారు. అనంతరం వారు లైక్‌ను కత్తులతో విచక్షణారహితంగా పొడిచి హత్య చేసి పరారయ్యారు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించి, కేసు నమోదు చేశారు. నిందితుల కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సాంకేతికత ఆధా రంగా నగరంలోని కోటమిట్ట, మెక్లెన్స్ రోడు ప్రాంతానికి చెందిన సయ్యద్ నూరుద్దీన్ ఉరఫ్ బాష, వైఎస్ఆర్‌నగర్ పుట్టవీధికి చెందిన షేక్ ఉస్మాన్ ఉరఫ్ దావులు హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈ క్రమంలో నిందితులు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలోని టిడ్కో ఇళ్ల ఎదురుగా ఖాళీ ప్రదేశంలో ఉన్నారన్న సమాచారంతో వారిని శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి బైక్, హత్యకు ఉపయోగించిన కత్తులను స్వాధీనం చేసుకు న్నారు. లైక్ వద్ద నూరుద్దీన్ పనిచేసేవాడు. మృతుడు లైక్ ముద్దాయి నూరుద్దీన్ భార్యతో చనువుగా ఉండటానికి ప్రయత్నిస్తూ, ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తు ఉండటంతో కక్ష పెంచుకొని తన స్నేహితుడితో కలిసి హత్య చేసినట్లు విచారణలో నూరుద్దీన్ తెలిపాడని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ సీహెచ్ కోటేశ్వరరావు, ఎస్‌ఐలు ఏ. అయ్యప్ప, అబ్దుల్ రజాక్, క్రైమ్ పార్టీ హెడ్‌కానిస్టేబుళ్లు సురేష్, నజ్మల్ హస్సేన్, కానిస్టేబుళ్లు శ్యామ్, సుబ్బారావు, రియాజ్, వదర్దన్, మొహమ్మద్‌లను ఎస్పీ అభినం దించారు.

స్కూటీ, మోటారుసైకిల్ ఢీ

● ఇద్దరికి గాయాలు

కావలిరూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్కూటీ, మోటారుసైకిల్ ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన శనివారం ముసునూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ట్రంక్‌రోడ్డుపై జరి గింది. స్థానికుల వివరాల మేరకు.. కావలి పట్టణం బాల క్రిష్ణారె డ్డినగర్‌కు చెందిన నవులూరి బాబురావు ఆంజనేయస్వామి ఆల యంలో పూజారిగా పనిచేస్తున్నారు. దీంతో ఆలయానికి వెళ్లేందు కు స్కూటీపై ఇంటి నుంచి బయలుదేరాడు. అలాగే ముసునూరుకు చెందిన వీ మహేంద్రబాబు మోటారుసైకిల్‌పై పట్టణంలోకి బయలు దేరాడు, మార్గమధ్యంలో ఆలయం సమీపంలో పూజారి బాబురావు రోడ్డు క్రాస్ చేస్తుండగా స్కూటీ, మాటారుసైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో స్థానిక ఏరియా వైద్యశాలలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం



రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, ఆగస్టు 16 (ఆంధ్ర జ్యోతి : కావలి- వెంకటేశ్వరపాలెం రైల్వే స్టేషన్ల మధ్యన దిగువ మార్గంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని సుమారు 35 నుంచి 40 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని కీమెన్ గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచార మిచ్చారు. పోలీసుల వివరాల మేరకు.. రైలు పట్టాలపై మృతదేహం పడి ఉన్న తీరును బట్టి శుక్రవారం రాత్రి రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా మృతుడి వద్ద చెన్నై నుంచి హౌరాకు రైల్వే టికెట్ తప్ప ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు బ్లూ చుక్కల తెలుపు రంగు ఫుల్ హ్యాండ్ చొక్కా, తెలుపురంగు కట్ బనీన్, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి జీఆర్పీ ఎస్‌ఐ కే.వెంకట్రావు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కావలిరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తేలుకాటుకు గురై తాటి చెట్టుపై నుంచి కింద పడి గాయపడి చికిత్స పొందుతుండిన బాలుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని గౌరవరం గిరిజన కాలనీకి చెందిన చౌటూరి చిన్నయ్య పట్టణంలోని పుల్లారెడ్డినగర్‌లో ఉన్న ఓ వాటర్ ప్లాంట్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు శ్రీనివాసులు(11) 5వ తరగతి చదువుతూ మధ్యలో మానేచి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీ వారి ఇంటికి సమీపంలోని పొలాల్లో తాటి పండ్లు కోసం తాటి చెట్టు పైకి ఎక్కి కాయలు కోస్తుండగా తేలుకాటుకు గురై కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన ఆ బాలుడిని స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 15వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. మృతుని తండ్రి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ బాలకృష్ణయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడు..

వెంకటాచలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వృద్ధుడు మృతి చెందినట్లు శనివారం పోలీసులు తెలిపారు. ఈనెల 10వ తేదీన బుజబుజ నెల్లూరు సమీపంలోని పెట్రోల్ బంకు పక్కన చెట్టు కింద ఓ గుర్తు తెలియని వృద్ధుడు(75) కదల్లేని స్థితిలో పడి ఉండగా, స్థానికులు 108 వాహనంలో నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	123
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 520



మండల పరిషత్ కార్యాలయం వద్ద ట్రంకురోడ్డులో ఆగిన వాహనాలు



శివాజీ సెంటర్‌లో ట్రంకు రోడ్డు వెంబడి పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు, కారు

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : లింగసముద్రం, మొగిలిచెర్ల, చినపవని గ్రామాలలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు మండల విద్యుత్ ఏఈ షేక్ ఫిరోజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లింగసముద్రం సబ్‌స్టేషన్ వద్ద రెండు చిన్న టవర్లు ఏర్పాటుతో పాటు 33 కేవీ విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనుల కారణంగా ఈ విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రజలు ఈ అంతరాయాన్ని గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

బార్ లైసెన్సుల జారీకి రేపు నోటిఫికేషన్



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు

కందుకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో ఉన్న మూడు బార్లకు లైసెన్సుల జారీకి ఈనెల 18న నోటిఫికేషన్ విడుదలవుతుందని ఇంచార్జి ఎక్సైజ్ సీఐ ఎస్. శ్రీనివాసులు తెలిపారు. శనివారం సాయంత్రం బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులతో ఆయన సమావేశమై లైసెన్సుల జారీ విధివిధానాలను వివరించారు. బార్‌లకు లైసెన్సు ఫీజు ఏడాదికి రూ.55 లక్షలుగా నిర్ణయించి ఆరువిడతల్లో చెల్లించే వెసలుబాటు కల్పించారని, బార్‌లు పనిచేసే వేళలను కూడా పెంచి ఉదయం పదిగంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అనుమతి ఇచ్చారని వివరించారు. బార్ లైసెన్సు కోసం దరఖాస్తు చేయాలంటే రూ.5 లక్షలు డిపాజిట్ చెల్లించాలని, కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతి అమలు చేయనున్నందున ఈ వెసలుబాటును ప్రస్తుత లైసెన్సీలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ సూచించారు.

ఎస్‌ఎఫ్ఐ మాజీ మహిళా నేత మృతికి సంతాపం

కావలి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జవహర్ భారతి పూర్వ విద్యార్థిని, ఎస్‌ఎఫ్ఐ మాజీ నాయకురాలు వేదవతి కావలి కోఆపరేటివ్ కాలనీలోని వారి నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. సీపీఎం దాని అనుబంధ సంస్థల నాయకులు శనివారం ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. వేదవతి జవహర్‌భారతికళాశాలలో చదువుకునే రోజులలో ఎస్‌ఎఫ్‌ఐలో చురుగ్గా పనిచేయటమే కాక విద్యార్థిసంఘాల ఎన్నికల్లో లేడీ రిప్రజంటేటివ్‌గా పోటీ చేశారన్నారు. కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని వారి హక్కుల కోసం పోరాడార న్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మామిళ్లపల్లి మోహన్‌రావు, సీనియర్ నేత తాళ్లూరు మాల్యాద్రి, పట్టణ కార్యదర్శి పీ.పెంచలయ్య, కాంట్రాక్ట్ లెక్చరర్స్ యూనియన్ నాయకులు బీ.వెంకట్, కే.జాన్, యూటీఎఫ్ నాయకులు శ్రీదేవి, రమాదేవి, వెంకటరమణయ్య, డీవైఎఫ్ఐ నాయకుడు అడపాల సురేష్ సంతాపం తెలిపారు.

కావలిలో ట్రాఫిక్ జటిలం!

» అసలే ఇరుకు రోడ్లు.. ఆపై ఆక్రమణలు
» పార్కింగ్ స్థలాల కరువు
» అడ్డదిడ్డంగా వాహనాలు
» పట్టించుకోని పోలీసులు
» ప్రజలు, వాహనచోదకులకు ఇక్కట్లు

కావలి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకు జటిలమవుతోంది. అసలే ఇరుకు రోడ్లతో ఇబ్బందిపడుతుండగా ఆ రోడ్లు సైతం ఆక్రమణలకు గురవుతోన్నాయి. దీంతో దారులన్నీ కుదించుకుపోతున్నాయి. దీనితో పాటు పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతుండడంతో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తోంది. అయినా మున్సిపల్ అధికారులు, పోలీసులు పట్టించుకోకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడుతోన్నారు. రోడ్ల ఆక్రమణలపై పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటనేది ప్రజల్లో చర్చనియాంశం అయ్యింది.

● బ్రిడ్జి కూడలిలో ట్రాఫిక్ సమస్య

పట్టణ మధ్యలో ఉన్న రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఉన్న ప్రజల రాకపోకలకు ఒకే ఒక ఆర్వోబీ ఉంది. దీనికి తోడు కావలి-దుత్తలూరు జాతీయ రహదారి వైపునకు రాకపోకలు సాగించే వాహనాలు కూడా ఆ వంతెన మార్గం మీదుగానే వెళ్లాలి. దీంతో స్థానిక బ్రిడ్జి కూడలి నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండటమే కాక తరచూ ట్రాఫిక్ స్తంభిస్తుంది. నిత్యం రద్దీగా ఉండే బ్రిడ్జి కూడలిలో వంతెనకు ఇరువైపులా ఉన్న అప్రోచ్ రోడ్లు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో వంతెన వైపు రాకపోకలు సాగించే వాహనాలు ప్రయాణికుల కోసం రోడ్డుపైనే ఆపుతున్నందున అక్కడ తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. అలాగే వంతెన మీదుగా వెళ్లే వాహనాలు టీటీడీ కల్యాణ మండపం వద్ద మలుపు తిరిగి రావాల్సి ఉండటం, ఆ మలుపు వద్ద కూడా ఆక్రమణలకు గురి కావడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే బ్రిడ్జి కూడలిలో రోడ్డుపై వాహనాలు నిలుపుతుండడంతో దాని ప్రభావం వలన మండల పరిషత్ కార్యాలయం వరకు వాహనాలు నిలిచిపోతున్నాయి.



ఆర్వోబీ వంతెన నుంచి వచ్చే మార్గంలో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

● పార్కింగ్ స్థలాలు లేక..

పట్టణంలో ఎక్కడా పార్కింగ్ స్థలాలు లేకపోవటంతో వాహనాలు రోడ్ల వెంబడి పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రంకు రోడ్డుపై ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీనికి తోడు వ్యాపారవర్గాలు రోడ్లు ఆక్రమించి రోడ్లమీదకు రావడమే కాక తమ వాహనాలను కూడా రోడ్డు మీదనే పార్కింగ్ చేస్తుండటం వినియోగదారులు కూడా దుకాణాల వద్ద రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంది.

● పట్టించుకోని అధికారులు

పట్టణంలో వాహనాలు రోడ్డుమీద నిలుపుతున్నా, ట్రాఫిక్ సమస్య జటిల మవుతున్నా, ఆక్రమణదారులు రోడ్డు మీదకు వస్తున్నా మున్సిపల్ అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రతరం అవుతోంది. బ్రిడ్జి కూడలితోపాటు ట్రంకు రోడ్డు వెంబడి, క్రిస్టియన్‌పేట మెయిన్‌లైన్, తుమ్మలపెంట రోడ్డు, దేవీ థియేటర్ రోడ్డు, సబ్ కోర్టువీధి, రైల్వే రోడ్డు, విష్ణాలయం రోడ్డులో తరచూ ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పోలీస్‌లు పట్టణంలో ఆక్రమణలు, ట్రాఫిక్ సమస్యపై దృష్టి పెట్టాల్సి ఉంది.

భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలి

● లక్ష్మీనృసింహుడి సేవలో ఎమ్మెల్యే ఇంటూరి కుటుంబం



మాలకొండకు లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి కుటుంబ సమేతంగా తరలివచ్చిన కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులకు సూచించారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఎమ్మెల్యే నాగేశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భగుడిలో ప్రధాన ఉప అర్చకులు గౌరీశంకర్ అష్టోత్తర ప్రత్యేక పూజలు చేశారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. గోశాలలో గోమాతకు అరటిపండు ప్రసాదం పెట్టి పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలైన కేశఖండనశాల, లడ్డూప్రసాదం కౌంటర్, మహా అన్నదానం, కోనేరు, మరుఉడొడ్లు, తదితర పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయంలో జరిగే అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. భక్తులకు రుచి, శుచితో కూడిన నాణ్యమైన భోజనం, ప్రసాదాలు అందించాలన్నారు. ఆలయానికి పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా వసతులు పెంచాలని తెలిపారు. భక్తులకు అసౌకర్యాలు కలిగితే సహించేది లేదని తెలిపారు. దాతలను ప్రోత్సహించి ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులను స్వామి అని గౌరవంగా సంబోధించాలని సూచించారు. ఆలయ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట ఆయన సతీమణి సౌజన్య, ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, ఎస్ఐ మరిది నాయుడు, న్యాయవాది ప్రగడ శ్రీనివాసులు, కామినేని అశోక్, చుండి అక్కయ్య, కాకుమాను హర్షకుమార్, శనివారపు మాల్యాద్రి, మహంకాళి మల్లికార్జునరావు, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కొండాపురం : గొట్టిగుండాలలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణుడి గ్రామోత్సవం

కందుకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రజలు కుటుంబ సమేతంగా ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దబజారులోని కృష్ణాలయం, వేణుగోపాలస్వామి ఆలయాలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. పట్టణంలోని పలుప్రాంతాలలో యువతీయువకులు, మహిళలు ఉట్టికొట్టే ఉత్సవాలు కోలాహలంగా నిర్వహించారు. కాళిదాసువారివీధిలో కృష్ణాష్టమి సంబరాలు నిర్వహించారు.

● **కావలి రూరల్ :** మండలంలోని చలంచర్ల, నారాయణపురం, పెద్దారం, అన్నగారిపాలెం తదితర గ్రామాల్లోని శ్రీకృష్ణ మందిరాలు, రామాలయాలు, కృష్ణ మండపాల వద్ద శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు, మండపాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. చలంచర్లలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఉంచిన శ్రీకృష్ణుని ప్రతిమను గ్రామస్థులు ఊరేగిపుగా మండపానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాధాలు పంచిపెట్టారు. మండపం వద్ద కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు, వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం కోలాహలంగా జరిగింది. రాత్రికి అన్నసంతర్పణ కార్యక్రమంతో పాటు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● **అల్లూరు :** శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక వైష్ణవాలయాల్లో కృష్ణాష్టమి వేడుకలు వైభవోపేతంగా నిర్వహించారు. బ్రహ్మానంద గీతాశ్రమంలో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాగభూషణం, శేఖర్‌రెడ్డి, పప్పు సుధాకర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● **కొండాపురం :** శ్రీకృష్ణుడి పుట్టినరోజు సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుపుకున్నారు. గొట్టిగుండాలలో త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి, హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో కృష్ణ భగవానుని ప్రతిమకు పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. సత్యవోలు పంచాయతీలోని అగ్రహారంలో ఏర్పాటు చేసిన కృష్ణుని విగ్రహానికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

● **లింగసముద్రం :** మండలంలోని పలు గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. లింగసముద్రంలోని ఒకటవ వార్డులో గోకులం సం ఘంకు చెందిన యువకులు కిలారి యశ్వంత్, మహేష్ తదితరులు శ్రీకృష్ణ భగవానుడి విగ్రహానికి పూలమాల వేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గోపాల్‌నగర్‌లో కూడా శ్రీకృష్ణుడు సమేత రుక్మిణీ, సత్యభామల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, మట్లి వేణుగోపాల్, కల్లగుంట ప్రసాద్ తదితరులు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

● **ఉలవపాడు :** మండలంలోని పలు గ్రామా ల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కరేడులోని శ్రీకృష్ణ మందిరంలో రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న వితరణ జరిగింది. సాయంత్రం ఉత్సాహంగా యువత ఉట్టి కొట్టారు. అనంతరం ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే ఉలవపాడు శ్రీకృష్ణుడి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం గ్రామబంతి నిర్వహించి సాయంత్రం యువకులు ఉట్టికొట్టారు.



బిట్రగుంట : రుక్మిణీ, సత్యభామలను పరిణయ మాడుతున్న గోపాలకృష్ణుడు

● **కలిగిరి :** మండలంలో శ్రీకృష్ణాష్టమివేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు కృష్ణుని వేషం, పెద్దలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఇళ్లల్లో కృష్ణుని పాదాలు వేసి వేడుకలను జరుపుకున్నారు. పలు చోట్ల ఉట్టి మహోత్సవాలు ఏర్పాటు చేశారు.

● **బిట్రగుంట :** మండలంలో కృష్ణాష్టమి వేడు కలు ఘనంగా జరిగాయి. బోగోలు యాదవపాలెంలోని వేణు గోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. రాత్రి రుక్మిణి సత్యభామలతో గోపాలకృష్ణుని కల్యాణం నిర్వహించారు. షిరిడీ సాయిబాబా, పాతబిట్రగుంట శేషసాయి మందిరాల్లో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి.



అల్లూరు : గీతాశ్రమంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి, తదితరులు



కావలి రూరల్ : చలంచర్లలో స్వామివారిని మండపానికి తీసుకువస్తున్న భక్తులు



లింగసముద్రం : శ్రీకృష్ణ భగవానుడికి పూజలు చేస్తున్న యువకులు



ఉలవపాడు : రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సర్దార్ గౌతు లచ్చన్న జీవితం స్ఫూర్తిదాయకం

● ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి



గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి, గౌడ సంఘం, టీడీపీ నేతలు

కావలి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సాధారణ కుటుంబంలో జన్మించి అసాధారణ వ్యక్తిత్వాన్ని చూపించి సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడిన సర్దార్ గౌతు లచ్చన్న జీవితం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ట్రంకు రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి గౌడు సంఘ నేతలు, టీడీపీ నేతలతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ వల్లభబాయి పటేల్ తర్వాత సర్దార్ బిరుదు పొందిన ఏకైక తెలుగువాడు గౌతులచ్చన్న అన్నారు. ఆయన బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం శ్రమించి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ఆయన కలల సాకారం కోసం రాజకీయరంగంలో, ప్రజాసేవలో తాను ఎల్లప్పుడు కృషి చేస్తానని తెలిపారు.

● కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే

శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని యాదవ ఎంప్లాయీస్ అండ్ ఫెడరేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నారాయణ కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషదారణలతో అలరింప చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ అసోసియేషన్‌కు సంబంధించిన నాయకులు జీ.భరత్‌కుమార్, బ్రహ్మానందం, జనిగర్ల మహేంద్ర, సన్నిబోయిన నారాయణ, రమణయ్య, కృష్ణయ్య, మనోహర్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జయంతి వేడుకలు

కలిగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయగిరి నియోజకవర్గ జైగౌడ ఉద్యమం అధ్యక్షుడు పంది మాల్యాద్రి ఆధ్వర్యంలో గౌతు లచ్చన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి గౌతు లచ్చన్న చేసిన కృషిని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహేష్, జైకృష్ణ గౌస్‌పీర్, జిలాని తదితరులు పాల్గొన్నారు.



కలిగిరిలో నివాళులర్పిస్తున్న మాల్యాద్రి గౌడ్, తదితరులు

ప్రభుత్వాలు మారినా తీరని భూ సమస్యలు!

● నోషనల్ ఖాతాలను పరిష్కరించరా? ● ప్రభుత్వ భూములుగా పట్టా భూములు
● అధికారుల తప్పిదాలకు యజమానుల బలి ● తహసీల్దారు కార్యాలయాల్లో కదలని ఫైళ్లు
● పరిష్కారానికి నోచని రీ సర్వేలో తప్పులు ● ఆందోళనలో రైతులు

జలదంకి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా భూ సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో పెనం మీదున్న భూ యజమానులు ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఏకంగా పొయ్యిలో పడిపోయారు. అదెలాగంటే గత ప్రభుత్వంలో చుక్కల భూములను తొలగించి పట్టా భూములుగా మార్పు చేస్తూ జీవో ఇవ్వడమే కాక అమ్మకం, కొనుగోళ్ల లావాదేవీలు జరిగేలా చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిని నిలిపివేస్తూ కనీసం ఈక్రాప్(పంటనమోదు) చేసుకునేందుకు కూడా లేకుండా అండగల్, వన్‌బిలు నిలుపదల చేశారు. ఇలా చేసి ఒకటిన్నర సంవత్సరం కావస్తోంది. కానీ నేటికీ వాటి వరిష్కారం చూపలేదు. ఎవరో ఎక్కడో వైసీపీ నాయకులు తప్పు చేశారని సాకు చూపి మొత్తం అందరి రికార్డులు నిలుపదల చేయడం ఏమిటని సాక్షాత్తూ అధికార కూటమి పార్టీల నాయకులే రాష్ట్రప్రభుత్వ వైఖరిని ప్రశ్నిస్తున్నారు. అతేవిధంగా తహసీల్దారు కార్యాలయాల్లో అవినీతి విషయంలో కూడా ప్రజలు పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ సామెతే. ఏ చిన్న పనికైనా వేల రూపాయలు రెవెన్యూ సిబ్బందికి ముట్టజెప్పాల్సిన పరిస్థితి వస్తోందని ప్రజలు బహిరంగంగా చెప్పుకొస్తున్నారు. ఈ విషయంలో అధికార, ప్రతిపక్షం అనే తేడా ఏమీ లేదని, ఎవరైనా సరే నగదు ముట్టజెప్పితేనే ఫైళ్లు ముందుకు కదులుతాయన్న విమర్శలు ఉన్నాయి. చిన్న అడంగల్‌లో అక్షరం తప్పుబడినా, అడంగల్, వన్‌బీలు డిజిటల్ సంతకం ఆగినా సరే నగదు ముట్టజెప్పాల్సిందేనని విమర్శిస్తున్నారు. రెవెన్యూశాఖలో అవినీతిపై గత వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించిన అధికారపక్షం నేడు అదే తీరు వారిలో ఉండడంతో నేతలు తాము నోళ్లకు ప్లాస్టర్‌లు వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని బహిరంగంగా వాపోతున్నారు. నోషనల్‌ఖాతాలు తీసేయాలంటే తహసీల్దారుకు అర్జీ పెట్టుకోవాలి. అలా అర్జీ పెట్టుకున్న తరువాత వీఆర్వో స్థాయి నుంచి తహసీల్దారు వరకు పరిశీలించి పాత రికార్డులు జతపరిచి జాయింట్‌కలెక్టర్ కార్యాలయం తయారు చేసిన చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని రికార్డులు జతపరిచి పంపాల్సి ఉంది. ఈ పనంతా చేయాలంటే వారం, పదిరోజులు పడుతుంది. కానీ నెలల తరబడి తహసీల్దారు కార్యాలయం నుండి ఫైళ్లు ఆర్డీవో కార్యాలయంకు చేరడం లేదు. బాధిత భూయజమానులు ఈ పని కోసం విపరీతంగా తహసీల్దారు కార్యాలయాలకు తిరుగుతున్నారు. కానీ వారికి ఇవేమీ పట్టనట్టు రోజుల తరబడి కాలం వెళ్లదీస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంలో కూడా వేలాది రూపాయులు భూయజమానులు రెవెన్యూ సిబ్బందికి చేతులు తడుపుతున్నా పనులు మాత్రం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ విషయాన్ని బాధితులు అధికారపార్టీ నేతల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేపై ఎన్డీఏ కూటమి నేతలు తీవ్రమైన విమర్శలు గుప్పించి ప్రజల నుంచి ఓట్లు దండుకున్నారు. కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 16 నెలలు గడుస్తున్నా ఒక్కటంటే ఒక్క సమస్య పరిష్కారం చూపలేదు. గత ప్రభుత్వం రీసర్వేలో అనేక తప్పులు చేయగా ఇందుకు రీసర్వే జరిగిన గ్రామాల్లో ప్రస్తుత ప్రభుత్వం గ్రామసభలు పెట్టి అర్జీలు తీసుకుంది. ఈ అర్జీలు తీసుకుని ఏడాది అవుతున్నా వీటికి నేటికీ పరిష్కారం చూపకపోవడం గమనార్హం. ఇంతటి అలసత్వం ఏంటని రీసర్వే జరిగిన గ్రామాల భూ యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇలా ఒకటేంటి ప్రతీ పనిలోనూ రెవెన్యూశాఖ తీవ్ర విమర్శలు ప్రజల నుంచి ఎదుర్కొంటోంది. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చిపెడుతోంది. ఇప్పటికైనా అధికారపక్షం మేల్కొని రెవెన్యూలో పేరుకుపోయిన సమస్యలు, జరుగుతున్న అవినీతిపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి పాలనను గాడిలో పెట్టాలని ఇటు బాధిత భూ యజమానులు, కూటమి పార్టీలకు చెందిన గ్రామస్థాయి నాయకులు కోరుతున్నారు.


హాస్టల్ విద్యార్థినులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుంది

● ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ



వసతిగృహ విద్యార్థినిలతో మాట్లాడుతున్న ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

కావలి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) : కావలి ఆర్డీవో కార్యాలయం ఆవరణలో ఉన్న వసతిగృహ విద్యార్థినులకు రెడ్‌క్రాస్ అండగా ఉంటుందని ఆర్డీవో, రెడ్‌క్రాస్ ఛైర్మన్ ఎం. సన్నీ వంశీ కృష్ణ తెలిపారు. శనివారం వసతి గృహ ప్రాంగణంలో ఏర్పాటు చేసినన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ వసతి గృహాన్ని రెడ్‌క్రాస్ దత్తత తీసుకుని విద్యార్థినులకు కనీస అవసరాలు కల్పించటం ప్రారంభించామన్నారు. కనమర్లపూడి కోటేశ్వరరావు సహకారంతో అన్ని సబ్జెక్ట్‌లకు ట్యూషన్ సౌకర్యం, తరచూ నిపుణులచే వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థినులు వసతిగృహం నుంచి బయటకు వెళ్లే సమయానికి ఆంగ్లభాషలో నిష్ణాతులుగా మలుస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అనంతరం ఇలింద్ర మాధవరావు తన సతీమణి జయలక్ష్మి జ్ఞాపకార్థం 100 చాపలు, బోరెడ్డి రజనీ 10 ఎమరెజన్సీ ట్యూబ్ లైట్లు వసతిగృహంకు బహూకరించగా వారిని ఆర్డీవో సత్కరించారు. ఈ వైద్యశిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాధిక, మాధురి, నళినీ పద్మ, టీ.పద్మ, టీ.రమ్య, రెడ్‌క్రాస్ హాస్టల్ సబ్‌కమిటీ కన్వీనర్ స్వర్ణలత, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ తిరుపతయ్య, రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, వసతి గృహ సంక్షేమాధికారులు, ట్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.




ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

హ్యాప్రీ బస్!



మహిళల్లో పొంగిపొర్లుతున్న సంతోషం

శ్రామిక స్త్రీలలో పెద్ద భారం దిగిన ఆనందం

ఎన్నికలొస్తే ఎన్నో చెబుతారు. గెలిచాక అందరూ ఓడమల్లన్నలే! నాయకుల నాలుకలకు నరం ఉండదు. అయినా వాళ్లు మాత్రం అన్నేసి వేల కోట్లు ఎక్కడ నుంచి తెస్తారు. డబ్బులేమన్నా అచ్చేస్తారా?

.. ఇవి జనంలో ఉండే అభిప్రాయాలు.

అదిగదిగో.. మేం చెప్పలేదా.. చంద్రబాబువన్నీ అబద్ధాలే. సూపర్ సిక్స్ ఒక మోసం.

.. ఇవి జగన్ తరచూ గొంతు చించుకుని అరిచే మాటలు.

మరి నిజం ఏమిటి?

ఒక్కటొక్కటిగా చెప్పిన మాటలన్నీ నిజం అవుతున్నాయి. చంద్రబాబు హామీలన్నీ పట్టాలెక్కుతున్నాయి. తల్లికి వందనం అంటూ ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయి. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందుతున్నాయి. రైతన్నలకు ఆర్థికసాయంతో తొలివిడత జమ అయ్యింది. తాజాగా శుక్రవారం సాయంత్రం నుంచి ఆడవాళ్లకు ఫ్రీబస్ మొదలైంది. ఈ ఉచిత ప్రయాణం ఒక సంచలనం. పట్టణాలపై బతుకు ఆధారపడిన గ్రామీణ శ్రామిక స్త్రీలకు ఒక వరం. వారి ఆనందం వర్ణనాతీతం.. అందుకు సాక్ష్యమే జిల్లా నలుమూలల నుంచీ ఆంధ్రజ్యోతి ప్రతినిధులు సేకరించిన ఈ మాటలు..

ఆంధ్రజ్యోతి - తిరుపతి జిల్లా నెట్‌వర్క్



మా కష్టం మిగులుతుంది

మేముండేది వెంకటగిరిలో. బాలాయపల్లిలో మెస్సు నడపతాము. రోజూ వెంకటగిరి నుంచీ పొద్దున్నే నేను, మా ఇంటాయన, కూతురు ముగ్గరం బాలాయపల్లి పోతాం. అక్కడ మెస్సు పని చూసుకుని రాత్రికి తిరిగి ముగ్గరం వెంకటగిరికి వచ్చేస్తాం. పోనూరానూ ఒక్కొక్కరికి బస్సు చార్జీ రూ. 60 అవుతుంది. నెలకు రూ. 1800 లెక్కన ముగ్గరికీ రూ. 5400 అవుతుంది. ఇపుడు ప్రభుత్వం ఆడోళ్లకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీగా తిరగనిస్తా వుంది కాబట్టి నాకూ, నా కూతురికీ ఇద్దరికీ కలిపి నెలకూ రూ. 3600 మిగులుతుంది. కష్టపడి పనిచేసుకుని బతికే మాలాంటి వాళ్లకు ఇది చాలా మేలు చేసినట్టే.

- షేక్ మస్తానమ్మ, వెంకటగిరి

కూరగాయలకన్నా వస్తుంది!

శని, ఆదివారాలు రెండ్రోజులు లీవులు. అందుకని పిల్లలను పిలుచుకుని సూళ్ళూరుపేటలో వుండే మా అక్క ఇంటికి పోతున్నా. మాలాంటి పేదోళ్ళకు 50 రూపాయలు మిగిలినా మిగిలినట్టే. దాంతో కూరగాయలు కొనుక్కుంటాం. చంద్రబాబుకు చేతులెత్తి మొక్కాలి.

- చెంగాలమ్మ, వాకాడు



CTBTA
DATE 17-08-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION

టుడే సప్లై రేట్ 117/-	డ్రెస్సిడ్ స్కిన్‌తో 215/-
రిటైల్ లైవ్ బర్డ్ 142/-	స్కిన్‌లెస్ 240/-

వెంకటరమణ
హార్ట్ & మెటర్నిటీ హాస్పిటల్
డి.నెం. 10-3-206/ఎ3/ఎ, రెడ్డి & రెడ్డి కాలనీ, తిరుపతి. 0877-2258183, 9490109100
ప్రముఖ గుండె వైద్య నిపుణులు
డా॥ సి.వెంకటరమణ
ఎం.డి.,డి.ఎం.,(కార్డియాలజీ)
సంపూర్ణ గుండె చికిత్స
ఇసీజి, 2డి ఎకో & కలర్ డాప్లర్
పీడియాట్రిక్ (చిన్నపిల్లలు) గుండె స్కానింగు
టియం.టి, హోల్టర్
ఏంజియోగ్రామ్, ఏంజియోప్లాస్టీ
పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్
వెంటిలేటర్ సదుపాయం
24 గం॥ ఐసీయు
ప్రముఖ స్త్రీ వైద్య నిపుణులు
డా॥ ఆర్.నిరుపమ
ఎం.బి.బి.ఎస్., డిజిఓ
EHS, WJHS, ALL TYPES OF INSURANCES AVAILABLE APSPDCL
24 గంటలు ఎమర్జెన్సీ, ICU
Cathlab, CTOT, Advanced Surgical OT, Labour Room సౌకర్యం కలదు





నమ్మబుద్ధి కావడం లేదు!

బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణమంటే నమ్మబుద్ధి కావడం లేదు. సీఎం చంద్రబాబు సార్ ఆడోళ్ళకు ఆర్టీసీ బస్సుల్లో ఫ్రీ చేయడం మాలాంటి పేదోళ్ళకు చానా సాయం చేసినట్టు. ఇపుడు మేము టౌనుకు వచ్చి హాయిగా పనులన్నీ చూసుకుని ఇండ్లకు పోగలుగుతాము.

- లచ్చమ్మ, ఎల్లసిరి గ్రామం, నాయుడుపేట మండలం

ఆత్మవిశ్వాసం పెంచింది!

ఇది మహిళలకు నిజంగానే ప్రభుత్వం ఇచ్చిన వరం. ఈ సదుపాయం వల్ల మేము ఎప్పుడైనా ఎక్కడికైనా వెళ్ళి మా పనులు చేసుకుని రాగల అవకాశాన్నిచ్చింది. ఆడవాళ్ళలో ఆత్మవిశ్వాసం పెంచింది.

- జమున, కొత్తపాళెం, చిట్టమూరు మండలం

పేటకు పొయ్యొచ్చే ఖర్చు మిగిలినట్టే!

మా ఊళ్ళో చిన్న బంకు పెట్టుకుని నడుపుకుంటున్నా. రెండు మూడు రోజులకు ఒకసారి సూళ్ళూరుపేటకు పోయి సరుకులు తెచ్చుకుంటా. పేటకు పొయినప్పుడల్లా రానూపోనూ బస్సు చార్జీలకు 60 రూపాయలు అవుతుంది. ఆ డబ్బులు మిగిలినట్టే.

- వెంకటమ్మ, కోటపోలూరు, సూళ్ళూరుపేట మండలం





చెయ్యి తడుముకునే పని లేదు

పనిమీద ఏడకన్నా బయల్దేరాలంటే బస్సు చార్జీలకు డబ్బు వుందా లేదా అని చూసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడా అవసరం లేదు. చేతిలో రూపాయి లేకపోయినా బస్సు ఎక్కేసి పని చూసుకుని వచ్చేయచ్చు.

- రాజేశ్వరి, గొల్లపాలెం, వాకాడు మండలం

ఎలక్షన్లలో చెబితే ఏమో అనుకున్నాం!

సముద్ర తీరప్రాంతంలో వుండే మాకు టౌనుకు రావాలంటే ఎంతో ఖర్చు అవుతుంది. ఆ ఖర్చుకు భయపడి ఒంటిగా వచ్చి పొయ్యే వాళ్ళం. ఇపుడు చంద్రబాబు పుణ్యమాని ఇంట్లో అందరం కలసి వస్తున్నాం. ఆర్టీసీ బస్సుల్లో ఇలా ఫ్రీగా తిరుగుతున్నామని తలచుకుంటా వుంటే ఆశ్చర్యంగా వుంది.

- అనూష, లీషాది, సుబ్బమ్మ... ఖరదగాలి కొత్తపాలెం, చిట్టమూరు మండలం



నెల్లూరులో గూడూరు కలుస్తుంది!



రాజకీయ ఉద్దండుల పురిటి గడ్డ గూడూరు నియోజకవర్గం. రాష్ట్ర రాజకీయాల్లో సంచలనాలు సృష్టించిన నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నేదురుమల్లి జనార్దనరెడ్డిల బలమైన ముద్ర కలిగిన గూడూరు నియోజకవర్గంలో అణగారిన వర్గాలనుంచి ఎమ్మెల్యేగా గెలిచి నిలదొక్కుకోవడం సామాన్యమైన విషయం కాదు. గూడూరు నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన పాశం సునీల్ ఇటు రాజకీయాలనూ, అటు పాలనాంశాలనూ బ్యాలెన్స్ చేసుకుంటూ ప్రయాణిస్తున్నారు. 30ఏళ్ల రాజకీయ జీవితంలో ఎదురైన సవాళ్లను అవకాశాలుగా మలుచుకొని రాజకీయ వైకుంఠపాళిలో ఒక్కొక్క మెట్టు పైకి ఎక్కుతూ వస్తున్నారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన పాశం సునీల్ తొలి ఏడాదిలో నియోజకవర్గంలో ఏం చేశారు? ఎన్నికలకు ముందు ఏం చెప్పారు? వాటి స్థితిగతులేమిటో ఆంధ్రజ్యోతితో సంభాషణలో వివరించారు.

తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ సారె

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ తరపున చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం సారె సమర్పించారు. తిరుత్తణి ఆలయ చైర్మన్ శ్రీధర్, తమిళనాడు దేవదాయ శాఖ జాయింట్ కమిషనర్ రమణి టీటీడీ చైర్మన్‌కు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు చైర్మన్‌కు ఆశీర్వచనం అందించి, పట్టువస్త్రాలతో సత్కరించారు.







భక్తులతో కిటకిటలాడుతున్న ఆనందగిరి ఆలయం - పుష్పపల్లకి సేవలో సుబ్రమణ్యస్వామి

హరోం..హర

- వైభవంగా ఆడికృత్తిక వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆనందగిరి

పాకాల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తికను పురస్కరించుకుని జిల్లాలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాలు శనివారం హరోంహర నామ స్మరణతో మార్మోగాయి. పాకాల మండలం ఊట్లవారిపల్లె ఆనందగిరి (పాళ్యంకొండ)పై వెలసిన వల్లీదేవసేన సమేత కల్యాణ సుబ్రమణ్యస్వామి ఆలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణోత్సవం చేశారు. రాత్రి ఊంజల్‌సేవ, పుష్పపల్లకి సేవ నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన పల్లకిపై స్వామివారు రాత్రి పురవీధులలో ఊరేగారు. ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారి దర్శనానికి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పుష్పకావిళ్లు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు ప్రముఖులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఇందులో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు, చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆలయం వద్ద సౌకర్యాలను పర్యవేక్షించారు. టీడీపీ మండల నేతలు అన్నదానం చేశారు. ఉచిత ప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ, పాలు లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు.



మాకు మర్యాద కావాలి

- జడ్పీ సమావేశంలో సభ్యుల డిమాండ్
- రోడ్ల పనులు పూర్తి చేయలేదని ఆగ్రహం

సమావేశ వేదికపై జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి

చిత్తూరు రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):మండలాల్లో అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని జడ్పీ సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ స్వాతంత్ర్య దిన వేడుకలకు కూడా అధికారుల నుంచి ఆహ్వానం లేదని, పంచాయతీల్లో సర్పంచ్‌ను ఏ ప్రభుత్వ కార్యక్రమాలకూ పిలవడం లేదని జేసీ, జడ్పీ చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీవోలు ప్రోటోకాల్ పాటించడం లేదని, జడ్పీటీసీ, ఎంపీపీలకు కనీస మర్యాద కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు.సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం ప్రోటోకాల్ పాటించని అధికారులపై ప్రివిలేజ్ కమిటీకి, స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీకి సంబంధించి వ్యవసాయశాఖ ఏడీ ఒకే రైతుకు సంబంధించిన చెక్కును తనతో పాటు ఇతరుల ద్వారా కూడా పంపిణీ చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సత్యవేడు నియోజకవర్గంలోని నాగలాపురం-టీపీ కోట రోడ్డు ఆర్టీసీ బస్సులు కూడా వెళ్లలేనంత అధ్వాన పరిస్థితిలో ఉందన్నారు. ఈ మార్గంలోనే 3 ప్రభుత్వ పాఠశాలలున్నాయని, విద్యార్థులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కేవీబీపురం మండలంలోని ఎగవపూడి , నారాయణవనం మండలంలోని తంబూరు, పాలమంగళం వంతెనలు భారీ వర్షాలు పడినప్పుడల్లా కొట్టుకుపోతున్నాయన్నారు.తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టేస్తున్నారని, ఇకనైనా వంతెనల నిర్మాణంపై అధికారులు దృష్టి సారించాలన్నారు.నాగలాపురం నుంచి సురుటుపల్లె వెళ్లే మార్గంలో 3 కిలోమీటర్లు రోడ్డు వేయాల్సి వున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రైవేటు, నెట్‌వర్క్ ఆస్పత్రులకు కూడా 108, 102 సర్వీసుల సౌకర్యం కల్పించాలని సూచించారు.పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నీటి సమస్య లేకుండా బోర్లన్నిటికి విద్యుత్ సౌకర్యం వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. కుప్పం జడ్పీటీసీ శరవణన్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా చిత్తూరు చర్చి వీధిలో ఉన్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయాన్ని నగరానికి నాలుగు కిలోమీటర్ల దూరంలోని సంతపేటకు మార్చడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. నారాయణవనంలో ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పనిచేయకుండా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొస్తున్నారని జడ్పీటీసీ సుమన్ ఆరోపించారు.శ్రీకాళహస్తి-పల్లం నడుమ సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు.మదనపల్లె జడ్పీటీసీ ఉదయకుమార్ మాట్లాడుతూ తమ మండలంలో మూడేళ్ల క్రితం సుమారు 75 లింక్ రోడ్లు మంజూరైతే ఒక్క రోడ్డు పని కూడా పూర్తికాలేదన్నారు. రామసముద్రం మండలంలో 28 రోడ్లకు గ్రావెల్ వేసి వదిలేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని జడ్పీటీసీ రామచంద్రా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.శ్రీకాళహస్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల సెక్యూరిటీ దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డీఈవో వరలక్ష్మిని జడ్పీటీసీ వెంకట సుబ్బారెడ్డి కోరారు. రామకుప్పం మండలం ఆర్.నడింపల్లెలో స్కూల్ నిర్మాణానికి తాను భూమి కొని ఇచ్చానని జడ్పీటీసీ నితిన్ రాఘవ రెడ్డి తెలిపారు. అయితే ఇప్పుడు ఆ పాఠశాలను వేరే పాఠశాలతో కలిపేశారని, దీంతో ఆ గ్రామంలో ఉన్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని,ఇప్పుడు తాను కొనిచ్చిన భూమిని ఏం చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లకు వెళ్లి వైద్యం అందించాల్సిన ఆశా కార్యకర్తలు ఆ పని చేయడం లేదని, వైద్యం అందించాలని చెప్పిన ఏఎన్ఎంపై దాడికి పాల్పడుతున్నారని పాకాల జడ్పీటీసీ పద్మజా రెడ్డి ఫిర్యాదు చేశారు.దీంతో గర్భిణులు, వృద్ధులు వైద్యం అందక ఇబ్బంది పడుతున్నారన్నారు.పెద్దమండ్యంలో ట్యాంకుల ద్వారా నీళ్ల సరఫరా చేసిన బిల్లులు రెండేళ్లయినా మంజూరు కాకపోవడంతో, ట్యాంకర్ల యజమానులు తన ఇంటి వద్దకు వస్తున్నారని జడ్పీటీసీ పీరమ్మ ఆందోళన వ్యక్తం చేశారు.వ్యవసాయ సర్వీసులకు రెండు సంవత్సరాల క్రితం డబ్బులు కట్టినా ఇప్పటికీ కనెక్షన్లు ఇవ్వలేదనిఆమె ఆరోపించారు.తమ మండలంలోనే సుమారు 500 వ్యవసాయ సర్వీసులు పెండింగ్‌లో ఉన్నాయని విద్యుత్ శాఖ దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తొలుత అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో సమావేశాన్ని ప్రారంభించారు. సభలో చర్చించిన విషయాలను జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, జేసీ విద్యాధరి మీడియా సమావేశం నిర్వహించి వివరించారు.సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



హాజరైన ఎమ్మెల్యేలు, సభ్యులు

మరణంలోనూ వీడని స్నేహం

- రైలు డోరు నుంచి జారి పడి ఇద్దరి మృతి





పోలయ్య - అర్షద్ (ఫైల్ ఫొటోలు)

నెల్లూరు(క్రైం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మరణంలోనూ వారు స్నేహాన్ని వీడలేదు...స్నేహితుడి కుమార్తె ఫంక్షన్‌కు వెళుతూ ఇద్దరు మిత్రులు ప్రమాదవశాత్తూ రైలు డోర్ నుంచి జారిపడి మృతి చెందారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి జిల్లా గూడూరు మండలం చెన్నూరుకు చెందిన పోలయ్య(24), అర్షద్(19), వెంకటేష్ స్నేహితులు. పోలయ్య ప్రైవేటు స్కూల్ వ్యాన్ క్లీనర్‌గా, అర్షద్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. స్నేహితుడు తమ్ముడి కుమార్తె ఫంక్షన్ కోసం ఈ ముగ్గురూ ఈనెల 14న రైలులో విజయవాడకు బయలుదేరారు. పోలయ్య, అర్షద్ బోగీ డోర్ వద్ద కూర్చుని మాట్లాడుకుంటున్నారు. నెల్లూరు కొండాయపాలెం గేటు సమీపంలో ప్రమాదవశాత్తూ వారిద్దరూ రైలులో నుంచి జారిపడ్డారు. కొద్ది సేపటి తర్వాత వెంకటేష్ వారికోసం రైలులో చూడగా కన్పించలేదు. నెల్లూరు రైల్వేస్టేషన్‌లో రైలు దిగి వారి కోసం గాలించాడు. ఆచూకీ తెలియకపోవడంతో చెన్నూరుకు వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియచేశాడు. అందరూ కలిసి వారి కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో ఈనెల 15న నెల్లూరు కొండాయపాలెం గేటు సమీపంలో రైలు పట్టాలపై నుజ్జునుజ్జుగా మారిన మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. శనివారం సాయంత్రం కొండాయపాలెం గేటు సమీపంలో చెట్లలో దుర్గంధం వస్తుండటాన్ని రైల్వే సిబ్బంది గమనించారు. చెట్లలో పరిశీలించగా ఓ మృతదేహం కన్పించింది. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడు అర్షద్‌గా గుర్తించారు.



గౌతు లచ్చన్నకు నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రైతు బాంధవుడు, విప్లవ నాయకుడు డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని శనివారం ఘన నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్ పూలమాల వేసి, నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ గౌతు లచ్చన్న సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. మొదటిసారిగా ఆయన జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. జిల్లా గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ తుమ్మల చెంగయ్య, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారిణి జ్యోత్స్న, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి, జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు16(ఆధ్రజ్యోతి): తిరుపతిలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆదివారం తిరుపతి-సికింద్రాబాద్ మధ్య ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు(07097) తిరుపతిలో ఆదివారం బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, కృష్ణ, యాద్‌గిర్, తాండూరు, వికారాబాదు, లింగంపల్లి, బేగంపేట మీదుగా మరుసటి రోజు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. తిరిగి ఈ రైలు(07098) సికింద్రాబాద్‌లో సోమవారం బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ మంగళవారం తిరుపతికి చేరుకుంటుందని వివరించారు. ఇందులో 2ఏసీ, 3ఏసీ, 3ఏసీ ఎకానమి, సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు, సాధారణ కోచ్‌లు ఉంటాయని వెల్లడించార


సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, ఆక్టోపస్ భవనం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,043

తలనీలాలు సమర్పించినవారు: 41,859



కథనం, ఇంటర్వ్యూ : గూడూరు, ఆంధ్రజ్యోతి

ప్రోగ్రెస్ రిపోర్ట్

ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా కాలేజీ దశలోనే రాజకీయాలతో కలిసి నడిచిన సునీల్ 1995లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. గూడూరు మున్సిపల్ చైర్మన్‌గా ప్రస్థానం మొదలైంది. 2014లో గూడూరు ఎమ్మెల్యేగా గెలుపొందారు. తిరిగి 2024లో రెండవ పర్యాయం ఎమ్మెల్యేగా విజయం సాధించారు. నిత్యం ప్రజల్లోనే ఉండే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. పిలిస్తే పలుకుతారు. చేయగలిగిన పనులు చేస్తారు. పార్టీలో అందరితో సఖ్యతగా ఉంటూ అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు. తొలి ఏడాది గూడూరు ఎమ్మెల్యేగా ఆయన చేసినవీ, చేయాల్సినవీ, ఆయనకు సంతృప్తినిచ్చినవీ.. ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు. ఆయన మాటల్లోనే...



తొలి ఏడాది చేసినవి ఇవీ...

తొలి ఏడాది కాలంలో గూడూరు నియోజకవర్గంలో రూ. 218 కోట్ల రూపాయల పనులు జరిగాయి.

- రోడ్ల నిర్మాణాలకు పెద్దపీట వేశాం. మొత్తం 700 పనులను 39.14 కోట్ల రూపాయలు ఖర్చు చేశాం.
- ఇరిగేషన్ పనులు పెద్ద ఎత్తున చేపట్టాం. చెరువులు, కాలువల మరమ్మతులు, చెక్‌డ్యాంలు ఇలా ఏడాది కాలంలో రూ.88 కోట్లతో 200 పనులు చేశాం.
- నాబార్డు, ఆర్‌డీఎఫ్ నిధులతో 33 ఆర్ అండ్ బీ రోడ్లు రూ.8కోట్లతో మరమ్మతులు చేశాం.
- నియోజకవర్గంలో లోటట్లేజ్ సమస్యతో రైతాంగం తీవ్రంగా ఇబ్బందిపడేది. తొలి ఏడాది కాలంలోనే రూ.5.77 కోట్లతో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశాం.
- వాకాడులో రూ.5.10 కోట్లతో 30 పడకల ఆసుపత్రి నిర్మించాం. రూ.16 లక్షలతో ఏరియా ఆసుపత్రి కాంపౌండ్ వాల్ నిర్మించాం.
- ప్రజా రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు గూడూరు డిపోకు రూ. 16కోట్ల వ్యయంతో 30 కొత్త ఆర్టీసీ బస్సులు తెప్పించాం.



నాడు

వైసీపీ ప్రభుత్వంలో గూడూరు-చెన్నూరు ప్రధాన రోడ్డు



నేడు

కూటమి పాలనలో అదే రోడ్డు

- గూడూరు మున్సిపాలిటీలో పారిశుద్యం, అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపట్టాం. రూ.69లక్షలతో అన్ని వార్డుల్లో కాలువల పూడిక తీయించాం. మురుగునీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకున్నాం.
- రూ.70లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశాం. రోడ్లు, డ్రైన్ల మరమ్మతులు, పార్కుల అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుపరచడానికి రూ.4 కోట్లు ఖర్చు చేశాం.



గూడూరులోని ఏరియా ఆసుపత్రి వద్ద నిర్మించి ఉన్న ప్రహరీగోడ



గూడూరులోని ప్రభుత్వ స్టేడియంలో నూతనంగా నిర్మించిన గ్యాలరీ



వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద స్వర్ణముఖీనది వరదనీరు పొంగకుండా రూ.1.70 కోట్లుతో నిర్మించిన కాంక్రీట్‌వాల్



కోట మండలం కోట గ్రామంలో నిర్మించిన సీసీరోడ్లు

గూడూరు నెల్లూరులోనే!

గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్

- రూ.218కోట్లతో అభివృద్ధి పనులు

తొలి అడుగు వేయడానికి భయపడ్డా..!

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం కింద గడప గడపా తిరమని అధిష్ఠానం ఆదేశించినపుడు నిజంగానే భయపడ్డాను. తొలి ఏడాదిలో ఏమి చేశారు? అని ప్రజలు అడిగితే ఏమి చెప్పాలి అనే ఆందోళన మొదలయ్యింది. ఇక అప్పుడు గూడూరు నియోజకవర్గంలో ఈ ఏడాది కాలంలో చేసిన పనుల లెక్క తీశాం. అది చూశాక కొంత ధైర్యం వచ్చింది. ఇంతలో 'తల్లికి వందనం' డబ్బులు ఖాతాల్లో పడ్డాయి. తటపటాయిస్తూనే ఇల్లిల్లూ తిరిగేందుకు కదిలాను. నాలుగు గడపలు తొక్కగానే శక్తి వచ్చింది. తల్లికి వందనం పథకంలో ప్రతి ఇంట్లో ఇద్దరు ముగ్గురు పిల్లలకు డబ్బులు పడ్డాయి. ఆ కుటుంబాల సంతోషం అంతా ఇంతా కాదు. నాలుగు వేల పింఛనుతో అవ్వాతాతలు ఆనందంగా పలకరించారు. ఇక ప్రజలు అడగడంతో నేనూ ప్రతి వీధిలో..ప్రతి ఊరిలో ఏదో ఒక అభివృద్ధి పని చేశాను.

- ఈ ఏడాదిలోనే సాధిస్తా!

? ఎన్నికలకు ముందు గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని మీరు మాట ఇచ్చారు. చంద్రబాబు కూడా ఇదే చెప్పారు. ఏడాది దాటింది కానీ ఈ హామీ అమలు కాలేదు.

! ఇందులో అనుమానం లేదు. ఈ విషయాన్ని మరచిపోనూ లేదు. సీఎంను కలిసిన ప్రతి సందర్భంలోనూ దీని గురించే మాట్లాడుతున్నా. తప్పకుండా జరుగుతుందని సీఎం కూడా హామీ ఇచ్చారు. ఎక్కువ సమయం కూడా పట్టదు. మహా అయితే ఏడాది లోపే ప్రభుత్వం నిర్ణయం ప్రకటిస్తుంది. గూడూరు నెల్లూరులో కలుస్తుంది.

? గూడూరు ఫ్లైవోవర్ పూర్తి చేయిస్తామన్నారు. ఇప్పటికీ ఇదో పెద్ద సమస్యగానే ఉంది.

! గూడూరులో ఫ్లైవోవర్ పనిని కాంట్రాక్టర్ ఆపేశాడు. అతని చేత పని చేయించడానికి ప్రయత్నిస్తున్నాం. అది సాధ్యం కాని పక్షంలో ఆ టెండరు రద్దు చేసి కొత్త వారిచేతనైనా సరే సాధ్యమైనంత త్వరగా ఫ్లైవోవర్ పనులు మొదలయ్యేలా చూస్తా.

? ఎమ్మెల్యే గారూ.. స్వర్ణముఖి బ్యారేజ్ ఎత్తు 2 అడుగులు పెంచుతామన్నారు. గుర్తుందా.

! ప్రస్తుతం ఉన్న స్వర్ణముఖి బ్యారేజీ వల్ల వాకాడు, కోట, చిట్టమూరు మండలాలకు ఇటు తాగునీరు, అటు సాగునీటికి ఇబ్బందులు లేకుండా భూగర్భజలాలు పెరిగాయి. ఈ బ్యారేజి ఎత్తును రెండు అడుగులు పెంచడంతో పాటు, కరకట్లను ఆధునీకరిస్తాం. తెలుగుగంగ జలాలతో వేసవికాలంలోనూ 3 టీఎంసీల నీటిని ఇక్కడ నిల్వ చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నాను. ఇది అమలు జరుగుతుంది.

? గూడూరులో పంబలేరు వాగుపై అసంపూర్తిగా వంతెనను పూర్తి చేస్తామని మీరిచ్చిన హామీ మాటేమిటి?

! గూడూరులో పంబలేరు వాగుపై వంతెన నిర్మించేందుకు 2018లో రూ.18 కోట్లు మంజూరు చేయించా. వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణం నత్తనడకన సాగింది. అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో పూర్తయిన వంతెన నిరుపయోగంగా మారింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి రాగానే ఈ వంతెనకు అప్రోచ్ రోడ్లు నిర్మించేందుకు చర్యలు మొదలయ్యాయి. ఇటీవల గూడూరు పర్యటనకు వచ్చిన ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి జనార్దన్‌రెడ్డితో కలసి దీనిని పరిశీలించాం. అప్రోచ్ రోడ్లకు రూ.9 కోట్లు కావాలని ప్రతిపాదనలు అందజేశాం. సీఎం దృష్టికి తీసుకువెళ్లా. త్వరలోనే నిధులు మంజూరు చేయించి వంతెనను పూర్తి చేసి ప్రజలకు అందబాటులోకి తీసుకువస్తా.

? గూడూరు చెరువుకట్టను ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. దీని సంగతేమిటి.

! చెప్పిన విధంగానే అధికారంలోకి రాగానే చెరువుకట్టపై ఉన్న ముళ్ల చెట్లను తొలగించాం. చెరువుకట్టను తుడా నిధులతో అభివృద్ధిపరిచేలా చర్యలు తీసుకున్నాం. చెరువుకట్టను ఆధునీకరించి, కట్టకు రివిట్‌మెంట్ చేయడంతో పాటు కట్టపై వాకింగ్ ట్రాక్, పార్కు, లైటింగ్ వంటి అభివృద్ధి పనులు చేపట్టి సుందరీకరించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే తుడా అధికారులు పరిశీలించి, దీనికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే పనులు మొదలవుతాయి.

"నేను పేదరికంలో పుట్టి పెరిగినవాడిని. ఇంట్లో ఒకరు జబ్బుపడితే ఆ ఇల్లు ఎంత కల్లోలం అవుతుందో నాకు తెలుసు. మధ్య తరగతి కుటుంబమైనా సరే ఇంట్లో ఒక మనిషి జబ్బుపడి మంచమెక్కితే ఆ కుటుంబం ఏళ్ల తరబడి కూడబెట్టుకున్న నగానట్రాతో సహా అన్నీ కరిగిపోతాయి. పేద కుటుంబానికి ఈ పరిస్థితి వస్తే ప్రాణాల మీద ఆశలు వదులుకోవాల్సిందే. ఆ సమయంలోనే వారికి సాయం అవసరం. అలాంటి వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సాయం అందేలా చేస్తున్నాను. ఈ సంవత్సర కాలంలో సీఎం రిలీఫ్‌ఫండ్ కింద 150 మందికి సాయం అందించాను. చెక్కులిచ్చే సమయంలో ఆ కుటుంబ సభ్యుల కళ్లలో కనిపించే సంతోషం.. ఎమ్మెల్యేగా నాకు ఎక్కువ సంతృప్తినిస్తుంటుంది."



శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాడ్మింటన్ పోటీలకు ముస్తాబైన ఇండోర్ స్టేడియం

రేపటి నుంచే జోనల్ స్థాయి క్రీడా పోటీలు

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జోనల్‌స్థాయి క్రీడా పోటీలు కోలాహలంగా జరగనున్నాయి. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శాప్ ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జోనల్ స్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఎస్వీ స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకానున్నారు. డీఎస్‌డీవో శశిధర్ పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వర్షం కారణంగా పోటీలు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగే 20న రిజర్వ్‌డేగా నిర్ణయించారు.

- **1,880మంది క్రీడాకారులు రాక** : రాయలసీమ జోన్ పరిధిలో వచ్చే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి మొత్తం 1,880మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా నుంచి 235మంది క్రీడాకారులు పోటీ చేయనున్నారు.
- **మైదానాలు ఇవే** : జోనల్ పోటీల కోసం ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలను ముస్తాబుచేశారు.

పది పాఠశాలల్లో బస : క్రీడాకారులకు నగర పరిధిలోని పది మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో బస ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక రవాణా ఏర్పాట్లు, మూడు పూటలా భోజన సదుపాయం కల్పించారు. ఎంపికచేసిన 10పాఠశాలలకు డీఈవో ఆదేశాల మేరకు సోమ, మంగళవారాలలో సెలవు ప్రకటించారు.

కొండనిండా భక్తులు





శ్రీవారి ఆలయం శనివారం భక్తజన సంద్రంగా మారింది. వరుస సెలవుల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండపై ఎటుచూసినా రద్దీ కనిపించింది. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు రావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం ద్వారా 942 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,861, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,919 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,798మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,488, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 479, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 373, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 109మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలను కలిపి 28,287 విక్రయించినట్టు ఆలయాధికారులు తెలిపారు.



మిస్ తిరుపతిగా సాత్విక

వెంకటగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఫరెవర్ స్టార్ మిస్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అందాల పోటీల్లో వెంకటగిరికి చెందిన బీటెక్ విద్యార్థిని చెన్నమనేని గమన సాత్విక విజేతగా నిలిచారు. ఈ మేరకు ఆ సంస్థ శనివారం ఆ విద్యార్థి పేరును మిస్ తిరుపతిగా ప్రకటించింది. వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ సీసీ నాయుడు కుమార్తె అయిన సాత్విక గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు.

తిరుమలలో గోకులాష్టమి

తిరుమల, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోగర్భం డ్యాం వద్దనున్న కాళీయమర్ధనుడైన శ్రీకృష్ణస్వామికి పంచాభిషేకాలు చేశారు. స్థానిక యువతతో ఉట్లోత్సవం నిర్వహించారు. టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగే రాత్రి శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉగ్రశ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం చేపట్టారు. కాగా ఆదివారం సాయంత్రం శ్రీవారి ఆలయం ముందు ఉట్లోత్సవం నిర్వహించనున్నారు. మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి తిరుచ్చిలపై మాడవీధుల్లో ఊరేగనున్నారు.



కాళీయమర్థనుడైన శ్రీకృష్ణస్వామికి అభిషేకం చేస్తున్న టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

నాలుగు ఎర్రచందనం దుంగల స్వాధీనం : ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పెంచలకోన వద్ద శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఆర్‌ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్‌ఎస్ఐ వినోద్ కుమార్ బృందం నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. పెంచలకోన వద్ద ఈదల చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు వారి కంటబడ్డారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ఒకరు మాత్రమే దొరికారు. సమీపంలో నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి నెల్లూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. స్మగ్లర్‌తో పాటు ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలు బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు

- వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్‌లో రెండు నాజిల్స్ సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పెట్రోలు బంకుల్లో శనివారం విజిలెన్సు అధికారులు తనిఖీలు చేపట్టారు. సీఎస్‌డీ గంగయ్య, లీగల్ మెట్రాలజీ విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్ ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. అక్కారంపల్లి సర్కిల్ వద్దనున్న వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్ పంపుల్లోని కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించి, రెండు నాజిల్స్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరవి చెప్పారు.



అధ్వానంగా కొత్తగుంట - మల్లాం రోడ్డు



రోడ్డుపై గోతులు

చిట్టమూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కొత్తగుంట - మల్లాం రోడ్డు అధ్వానంగా మారింది. ఆరు కిలోమీటర్లు ఉన్న ఈ మార్గం జోడి చెరువుల నుంచి రోడ్డుకు ఇరువైపులా రోడ్డు మార్జిన్‌లు దెబ్బతిని, పెద్దపెద్ద గోతులతో పడి ప్రమాదాలకు కారణమవుతోంది. ఏటా వరదలు వచ్చినప్పుడు రొయ్యల కాలువ కట్టలు దెబ్బతిని నీటి ప్రవాహం ఎక్కువై రోడ్డు మరమ్మతులకు గురౌతుంటుంది. గత ఐదేళ్లలో వరదల తాకిడికి ఈ రోడ్డు అధ్వానంగా మారినా తట్టడు మట్టి వేయలేదు. రాత్రి వేళల్లో రోడ్డులో గుంతలు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సెప్టెంబర్ 3 నుంచి 11 వరకు మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు వేలాది మంది భక్తులు వస్తారు. అంతేకాక తీర ప్రాంతాల ప్రజలు ఈ మార్గంలోనే నాయుడుపేట, కోట, సూళ్లూరుపేట పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యువతకు 20లక్షల ఉద్యోగాల అవకాశాలు కల్పిస్తామని నారా లోకేశ్ హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలలకు ఒక్కసారి వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతోందన్నారు. ఈనెల 21వ తేదీన జరగనున్న జాబ్‌మేళాలో వివిధ కంపెనీలకు సంబంధించి 600 వరకు ఉపాధి అవకాశాలు కల్పించ నున్నారని, ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతరావు, లోకనాధం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ చెంచుబాబు అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో గణేశ్ ఉత్సవాల నిర్వా హకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగించ కుండా, ఇతరుల మనోభావాలను దెబ్బ తీసేలా వ్యవహరించకుండా వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలరు. ప్రతిమల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. మున్సిపల్ అధికారులు నిర్దేశించిన ప్రదేశాల్లోనే నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.

గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఓజిలి, దొరవారిసత్రం: ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వినాయ కచవితిని పురస్కరించుకుని గణేష్ విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని నాయుడు పేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు అన్నారు. ఓజిలి, దొరవారిసత్రం పోలీసుస్టేషన్లలో శనివారం ఆయన గణేష్ ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవ కమిటీ తీసుకోవాల్సి అనుమతులు, జాగ్రత్తలు, బాధ్యతలను వారికి వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్ఐలు శ్రీకాంత్, ఎస్ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: వినాయ కచవితి వేడుకలకు గణేశ్ విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. శనివారం ఆయన పోలీసుస్టేషన్‌లో చవితి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు జరుపుకునేందుకు కమిటీ వారే బాధ్యత తీసుకోవాలన్నారు. ఏ ప్రాంతంలో విగ్రహాలు ఏర్పాటు చేస్తారో ముందస్తుగా తెలియజేసి అనుమతి తీసుకోవాలని, నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీజే, రికార్డింగ్ డాన్స్‌లు నిషేధమని, అందరూ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ భవనంలో శనివారం మానవ స్వచ్ఛంద సేవాసంస్థ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా బాలకృష్ణంరాజు, కార్యదర్శిగా రమణారెడ్డితో పాటు సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ రామచంద్రారెడ్డి, దశరధరామిరెడ్డి, జనార్దనరెడ్డి, నాశిన నాగులు, బొమ్మిడి శ్రీనివాసులు, కొండూరు కోదండరామయ్య, రాంప్రసాద్, మెహబూబ్‌బాషా, కిరణ్ చక్రవర్తి, సిద్ధారెడ్డి, వాసు, వెంకటేశ్వర్లురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అశోక్‌చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

సూళ్లూరుపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డిపోలో పనిచేసే కండక్టర్ పద్మ అక్రమ సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలంటూ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో ఉద్యోగులు శనివారం డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈ నెల 24న టికెట్ విషయంలో రూ.30 తేడా వచ్చిందని మహిళా కండక్టర్‌ను ఇన్‌చార్జి డిపో మేనేజర్ మునిచంద్ర సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. సస్పెన్షన్‌ను రద్దు చేసి కండక్టర్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు కరుణాకరరెడ్డి, కల్యాణ్ కృష్ణ, రమణయ్య, ఆనంద్, మాధవరావు, చిన్నయ్య పాల్గొన్నారు.



డిపో ఎదుట నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి

తడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని తమిళనాడువాసి మృతి చెందిన ఘటన తడ మండలంలోని పన్నంగాడు వద్ద జరిగింది. తమిళనాడు రాష్ట్రంలోని విల్లుపురం ప్రాంతానికి చెందిన ఆర్ముగం(48) కొంతకాలంగా తడ మండలంలోని ఎలాఊరులో ఉంటూ అల్యూమినియం పాత్రల వ్యాపారం చేస్తున్నాడు. శనివారం పన్నంగాడుకు వచ్చి తిరిగి వెళ్లేందుకు జాతీయ రహదారి దాటుతుండగా చెన్నై వెళుతున్న ఓ లారీ వేగంగా వచ్చి ఆర్ముగంను ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఎలాఊరు చెక్‌పోస్టు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లుగా వైద్యులు ధృవీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

తడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలు అయ్యాయి. మండల పరిధిలోని వాటంబేడుకుప్పం గ్రామానికి చెందిన బాలు అపాచీ పరిశ్రమలో పనిచేస్తుంటాడు. శనివారం విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై బయలుదేరాడు. మాంబట్టు సెజ్ రోడ్డు వద్ద మలుపు తిరుగుతుండగా నెల్లూరు వైపు వెళ్లే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు అతడిని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





వేనాడు దీవిలో నిర్మించిన రిసార్ట్‌లు

వేనాడు రిసార్ట్‌ల ప్రారంభానికి గ్రహణం

నిర్మాణం పూర్తయి ఏళ్లు గడుస్తున్నా నిరుపయోగంగానే ● అందుబాటులోకి వస్తే పర్యాటకులకు అనుకూలం

తడ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తడ మండల పరిధిలోని వేనాడు దీవిలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నిర్మించిన రిసార్ట్‌లు ప్రారంభానికి నోచుకోవడం లేదు. 2015లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు స్వదేశీ సదర్శన్ పథకాన్ని ప్రారంభించాయి. ఇందులో భాగంగా అప్పటి ఉమ్మడి నెల్లూరు జిల్లాకు రూ.36 కోట్లు కేటాయించింది. వేనాడు దీవిలో రిసార్ట్‌ల నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ 2019 ఎన్నికల నాటికి సుమారు 80శాతం పనులు పూర్తి చేశారు. తరువాత ప్రభుత్వం మారిపోవడంతో నత్తనడకన పనులు సాగాయి. ఎట్టకేలకు రిసార్ట్‌ల నిర్మాణం పూర్తిచేసి పర్యాటకశాఖకు అప్పగించారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం రిసార్ట్‌లను అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చేయలేదు. వేనాడు దీవిలో అందమైన మంచి నీటి దొరువులు, పక్కనే ఉన్న పులికాట్ సరస్సు, పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. అలాగే ఆసియాలోని అతిపెద్ద సమాధి అయిన షేక్ దావూద్ షావల్లి అల్లాతాత దర్గా ఉంది. ప్రతినెలా అమావాస్య నాడు వేల సంఖ్యలో భక్తులు బాబా దర్శనానికి రావడమే కాకుండా అక్కడ నిద్రిస్తుంటారు. రిసార్ట్‌లు అందుబాటులోకి వస్తే పర్యాటకులతో పాటు దర్గా సందర్శనకు వచ్చే భక్తులకూ ఎంతో అనుకూలంగా ఉంటుంది. అధికారులు చొరవ చూపి రిసార్ట్‌లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం.. అతివల్లో ఆనందం



గూడూరు పాత బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న మహిళలు

గూడూరు, ఆగస్టు 16: మహిళలు రాష్ట్రంలో ఎక్కడికి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించడానికి వెసులుబాటు కల్పించే స్త్రీ శక్తి పథకం ప్రారంభం కావడంతో అతివల్లో ఆనందం వ్యక్తమవుతోంది. శుక్రవారం నాడు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇకనుంచి జీరో ఫేర్ టికెట్‌తో ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం ఉండడంతో మహిళలు, విద్యార్థినులు, ఉద్యోగినులకు రోజువారీ ప్రయాణ వ్యయం ఆదా అవుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే మహిళలకు ఇది మరింత ఉపయోగకరంగా మారనుంది. ప్రధానంగా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించారు. గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, వాకాడు డిపోలు ఉన్నాయి. గూడూరు డిపోలో మొత్తం 56 సర్వీసులు నడుస్తున్నాయి. ఇందులో పల్లె వెలుగులు 30, అల్ట్రా పల్లెవెలుగు 3, ఎక్స్‌ప్రెస్‌లు 16 కలిపి 49 బస్సుల్లో మహిళలు ఉచితగా ప్రయాణించవచ్చు. అలాగే వాకాడు డిపోలో మొత్తం 44 సర్వీసులు ఉన్నాయి. ఇందులో 27 పల్లెవెలుగు, 16 ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణం అందుబాటులో ఉంది. మొత్తం మీద నియోజకవర్గంలోని రెండు డిపోల్లో 100 సర్వీసులు ఉండగా అందులో 92 బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. మహిళలు తమ ఆధార్, రేషన్, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి గుర్తింపు కార్డులను చూపి ఉచితంగా ప్రయాణాలు సాగించవచ్చు. స్త్రీశక్తి పథకంను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడంతో మహిళలలు ఆనందోత్సవాలు వ్యక్తం చేస్తున్నారు.





గూడూరు: ప్రత్యేక అలంకారంలో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు - వెంకటగిరి టౌన్: కృష్ణుడి వేషధారణతో చిన్నారులు

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

గూడూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పట్టణంలో శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రాజావీధిలోని వరసిద్ధి వినాయక ఆలయం వద్ద రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణుడు, చిన్నికృష్ణుడు విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణ, పాండవుల వేషధారణతో రథంపై పట్టణంలో ఊరేగింపు వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని బాహూజీ వీధిలో ఉన్న పాండురంగ స్వామి ఆలయం, కచ్చేరివీధిలోని కృష్ణమందిరం, షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వతంత్రపురంలో కృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ఉల్లాసంగా ఉట్టిని కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణష్టామి వేడుకలు నిర్వహించారు. శ్రీకృష్ణుడిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళవాయుద్యాల మంత్రోచ్చరణల నడుమ పూజలు జరిపారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు.

గూడూరు అర్బన్: స్థానిక త్యాగరాజవీధిలోని శ్రీకృష్ణ గీతామందిరంలో కృష్ణాష్టమి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చిల్లకూరు: మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం కృష్ణాష్టమి సందర్భంగా రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణుణి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కల్యాణ మహోత్సవం జరిగింది. భక్తులు కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మష్టామి వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు నృత్య ప్రదర్శన, గోపికల మధ్య కృష్ణుడి వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నిర్వహకులు నర్ర రవి, భాస్కర్, అలిమిలి మల్లికార్జున్, సుధాకర్, సుంకర రవి తదితరులు పాల్గొన్నారు.

చిట్టమూరు: మండలంలోని చిట్టమూరు, తంబుగారిపాళెం, తాడిమేడు కృష్ణ మందిరాల్లో శ్రీకృష్ణ జయంతి వేడుకలు జరిగాయి. తంబుగారిపాళెం కృష్ణ మందిరంలో వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ రుక్మిణి, సత్యభామ, శ్రీకృష్ణుడికి అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించున్నారు.

కోట: మండల పరిధిలోని సూరిశెట్టిపాళెం, సిద్ధవరం, కోటలోని చిన్మయ మిషన్‌లో కృష్ణష్టామి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీకృష్ణుడి చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కోటలోని చిన్మయ మిషన్‌లో చిన్నారుల చేత శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో కోలాటాలు ఆడించారు.







చిల్లకూరులో రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ కల్యాణం - నాయుడుపేటలో శ్రీకృష్ణుడికి పూజలు - సూళ్లూరుపేటలో ఉట్టి పూజ

హామీలను నెరవేర్చిన ఘనత సీఎం చంద్రబాబుదే



మురళీరెడ్డికి కేక్ తినిపిస్తున్న కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ హామీలను సంపూర్ణంగా అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీరెడ్డి అన్నారు. శిరసనంబేడులో శనివారం మురళీరెడ్డి జన్మదిన వేడుకలను కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మురళీరెడ్డి కేక్ కట్‌చేశారు. అనంతరం మురళీరెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్‌లో భాగంగా పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల అందజేత, అన్నదాత సుఖీభవ, స్త్రీశక్తి పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి, సునీల్, కిరణ్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ అంటే ఆలయంతో సమానం: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్లు ఆలయాలతో సమానమని ఎస్పీ హర్షవర్ధన రాజు పేర్కొన్నారు. పర్యావరణ, పరిశుభ్రతలో భాగంగా ప్రతి మూడవ శనివారం జిల్లాలోని అన్నిస్టేషన్లు శుభ్రం చేసి పర్యావరణాన్ని కాపాడుకునే క్రమంలో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో నిర్వహించారు.

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శిగా సుధాకర్



కోట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా విద్యానగర్‌కు చెందిన షోడవరం సుధాకర్ నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంకుమార్ ప్రకటన విడుదల చేశారు. సుధాకర్‌ను బీఎస్పీ నేతలు అభినందించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కోట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుగుంట గ్రామానికి చెందిన శ్రీకాంత్(28) గత నెల 27వ తేదీన గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి తిరుపతి రుయా ఆస్పత్రికిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్ఐ పవన్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న కటాక్షం

చంద్రగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం చేశారు. సాయంత్రం కన్నులపండువగా ఊంజల్ సేవ జరిగింది.. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి,బంగారు తిరుచ్చి వాహనంపై ఆలయమాడ వీధుల్లో ఊరేగించారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేదర్ చిరంజీవి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా టీడీపీ: పాశిం



శేషమ్మకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, తానంకి నానాజీ

చిల్లకూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎల్లవేళలా అండంగా ఉంటే పార్టీ టీడీపీయేనని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జ్యోతి వేబ్రిడ్జి కార్యాలయం వద్ద చిన్నయ్య భార్య శేషమ్మకు పార్టీ సంక్షేమనిధి నుంచి మంజూరైన రూ.5లక్షల చెక్కు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వల్లిపేడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త చిన్నయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్నారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేందుకు పార్టీ సంక్షేమ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైందన్నారు. మంత్రి లోకేశ్ కార్యకర్తల కోసం సంక్షేమ నిధి ఏర్పాటు చేసి ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా రన్నారు. అనంతరం బల్లవోలు గ్రామానికి యశ్వంతో పలువురు టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే టీడీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తానంకి నానాజీ, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, పెనుబోలు రామచంద్రారెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కుమార్‌యాదవ్, లీలావతి, కీరవాణి, సతీష్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, త్రివిక్రమ్ భూపతి పాల్గొన్నారు.

శ్రీ ధర్మరాజ స్వామి వారి దేవస్థానము
గూడూరు టౌన్ & మండలం, తిరుపతి జిల్లా

ప్రకటన నెం.నిల్/2025 తేది:11-08-2025

సీల్డ్ టెండరు మరియు బహిరంగ ప్రకటన

పై దేవస్థానము నందు నవరాత్రి మహోత్సవము మరియు సంక్రాంతి పండగల సందర్భముగా 4 నెలల పాటు అనగా తేది.20-09-2025 నుండి 19-01-2026 వరకు క్రింది తెలిపిన దేవస్థానమునకు ముందు గల శ్రీ అమ్మవారి అగ్ని గుండ ప్రదేశములోని ఉత్తరం వైపున తాత్కాలిక అంగళ్ళు ఏర్పాటు చేసుకొనుటకు సీల్డ్ టెండర్లు మరియు బహిరంగ వేలం పాటలు, పై దేవస్థానము వద్ద తేది:23-08-2025న మ.3.00 గం.లకు జరుగును. టెండరు షెడ్యూలు కొరకు రూ.200/- చెల్లించి ప్రకటన తేది నుండి తేది:23-08-2025న మ.12.00 గం.ల వరకు పై దేవస్థాన కార్యాలయము నందు పొందవచ్చును. ధరావత్తుతో పాటు టెండర్ షెడ్యూల్ తేది:23-08-2025న మ.3.00 గం.లలోపు టెండరు బాక్సు నందు వేయవలెను. అదే రోజు మ.3.30 ని.లకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో సీల్డ టెండర్లు తెరవబడును. ఈక్రింది లైసెన్సు హక్కులకు పాట తెగిన వెంటనే ధరావత్తుతో కలుపుకొని "4" నెలల అద్దె మొత్తం ముందుగా చెల్లించవలెను. తదుపరి ఆమోదం కొరకు ఉన్నతాధికారులకు పంపబడును.

వ.నెం.	లైసెన్సు వివరములు	ధరావత్తు రూ.	కాలపరిమితి
1.	శ్రీ అమ్మవారి అగ్ని గుండ ప్రదేశములో తాత్కాలిక అంగళ్ళు ఏర్పాటు	50,000/-	తేది.20-09-2025 నుండి తేది.19-01-2026 వరకు "4" నెలలు

పూర్తి వివరముల కొరకు దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించగలరు.

కార్యనిర్వాహణాధికారి
ఎమ్.రవిక్రిష్ణ
+91-7981294396

THE ANDHRA JYOTHY WAY CLASSIFIEDS
Services Finance Education Health Real Estate Wanted
ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్ ప్రతిరోజు

కర్ణాటక AC బస్సు యాత్ర
మైసూరు, శ్రీరంగ పట్నం, బేలూరు, శృంగేరి, కుక్కి సుబ్రహ్మణ్యం, గోకర్ణం, మరికొన్నిటిలో మా తదుపరి యాత్ర షిర్డి 7 రో. 1టి.రూ.14,400/-. తేది.24-08-2025. సం.ప్ర. బొబ్బల శేషయ్య, సెల్: 98665 27640
AJR-2890

పని మనిషి కావలెను
కావలిలో ఉంటున్న మా అమ్మ (72 సం.)కు వంట & ఇంటి పని చేసేందుకు ఒక మహిళా Care Taker కావలెను. జీతం & భోజన వసతి కల్పించబడును. స్థానికులకు ప్రాధాన్యత కలదు. సం.ప్ర.9550026403
AJR-240556

TOLET
నెల్లూరు టౌన్ హాలు ఎదురుగా ఆఫీసుకు, కోచింగ్ సెంటర్‌లకు బాడుగకు ఇవ్వబడును. సం.ప్ర. సెల్: 99853 12224, 94939 98347
AJR-212030

రైలు యాత్ర
కార్తీకమాసంలో మధ్యప్రదేశ్, గుజరాత్‌లోని 4 జ్యోతిర్లింగాలు, ద్వారకలు చూచుట తే.07-11-25. 12రో.1టి రూ.23,000/-. సం.ప్ర. బొబ్బల శేషయ్య, సెల్: 98665 27640
AJR-2905

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఒక్క రోజు జాలీ టూర్
షోలింగర్, తిరువల్లూరు, తిరుత్తణి, సురుటుపల్లి తేది:23-08-2025. 1 రోటి1కి 1600/- (A/c బస్సు, భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240617

కొల్హాపూర్ రైలు యాత్ర
కొల్హాపూర్, షిర్డి, ముంబై, 3 జ్యోతిర్లింగాలు, పండరీపురం తేది:24-10-25. 6 రో టి1కి 13000/- (రైలు, A/c రూం + A/c బస్సు భోజనం) కె.వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240615

శ్రీధర్ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ
నెల్లూరు నగరంలో ప్లాట్‌లు ఇళ్లు ఇళ్లస్థలాలు అపార్ట్‌మెంట్లు మరియు కమర్షియల్ బిల్డింగ్స్, కమర్షియల్ స్థలాలు, డెవలప్మెంట్ సైట్లు మరియు పొలములు కావలసిన వారు అమ్మదలచిన వారు సంప్రదించండి. కమర్షియల్ బిల్డింగ్స్ రెంటుకి కావలిసిన వారు ఇవ్వదలచిన వారు మాతో సంప్రదించండి. హంస శ్రీధర్, సెల్: 98663 22989
AJR-212029